

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శుక్రవారం 19 డిసెంబర్ 2025 | పేజీలు : 04


# ప్రజల వైద్యుడు వై. రామసుబ్బయ్య ఇకలేరు

- అనంతలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ కోసం అవిశ్రాంత పోరాటం
- ఉచితంగా వైద్య సేవలు
- డాక్టర్ రామసుబ్బయ్య మృతిపై పలువురు సంతాపం



డాక్టర్ రామసుబ్బయ్య మృతదేహం



డాక్టర్ రామ సుబ్బయ్య ఫైల్ ఫోటో



మృతదేహం వద్ద డా రామ సుబ్బయ్య కుటుంబ సభ్యులు





మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, డాక్టర్లు మాధవి లత, వెంకట్ తదితరులు, నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

**అనంతపురం, డిసెంబర్ 18, (ప్రభాతవార్త బ్యూరో)**

ఆయనకు కోపం అంటే తెలియదు. ఎప్పుడూ నవ్వుతూ రోగులు ప్రేమతో పలకరిస్తూ సేవలను అందిస్తూ వచ్చారు. పదవీ విరమణ పొందిన తర్వాత కూడా ఉచితంగా, తక్కువ ఫీజులతో వైద్య సేవలు అందించి ప్రజల డాక్టర్ గా గుర్తింపు పొందిన రిటైర్డ్ అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ వై రామసుబ్బయ్య (91) ఇక లేరు.. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. డాక్టర్ రామసుబ్బయ్య మృతదేహానికి శుక్రవారం మధ్యాహ్నం అనంతపురంలోని గుత్తి రోడ్ లో గల హరిచంద్ర ఘాట్ లో అంత్యక్రియలు నిర్వహించినట్లు డాక్టర్ రామసుబ్బయ్య కుమారుడు డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ శశాంక్ ఇతర కుటుంబ సభ్యులు నిర్ణయించారు. డాక్టర్ రామసుబ్బయ్య మృతిపై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టిడిపి జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి, సిపిఐ జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ,వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, వైసీపీ నేత కె.వి రమణ తదితరులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాజీ సైనికులు ప్రత్యేకంగా డాక్టర్ రామసుబ్బయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతపురంలో మెడికల్ కాలేజీ కోసం పట్టు వీడని విక్రమార్కునిలా ప్రయత్నించారు. అనంతపురంలో ప్రైవేట్ రంగంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని గతంలో పాలకులు ప్రయత్నించినప్పుడు ప్రభుత్వ రంగంలో కాలేజీ ఏర్పాటు చేయాలని వివిధ రూపాల్లో జరిగిన ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పరోక్షంగా డాక్టర్ రామసుబ్బయ్య కీలకంగా వ్యవహరించారు. అనంతపురం మెడికల్ కాలేజీ అంటేనే డాక్టర్ రామసుబ్బయ్య గుర్తుకొస్తారు. డాక్టర్ రామసుబ్బయ్య 1933 సంవత్సరం జులై ఒకటో తేదీన జన్మించారు. ఆరోజు వైద్యుల దినోత్సవం కావడం విశేషం. ఆరుగురు అన్నదమ్ముల్లో.. డాక్టర్ రామసుబ్బయ్య నాల్గవ సంతానం. వీరి సతీమణి వై సరస్వతమ్మ మూడు నెలల క్రితమే మరణించగా ఇప్పుడు డాక్టర్ రామసుబ్బయ్య గురువారం మన నుంచి దూరమయ్యారు. డాక్టర్స్ డే రోజున జన్మించిన ఆయన.. కాల మహిమో, యాదృచ్ఛికమో గానీ వైద్య వృత్తిని స్వీకరించారు. ఆ వృత్తిలో అంచలంచెలుగా రాణిస్తూ అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల స్థాపనకు అవిరళ కృషి చేశారు. స్థానిక నేతలతోనూ, పెద్దలతోనూ, వైద్య సంఘాలు, ఎందరో దాతలతోనూ విరాళాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించి అనంతపురానికి వైద్య కళాశాల వచ్చేలా కృషి చేశారు. అనంతపురం సర్వజన ఆసుపత్రిలో ఫిజీషియన్ గా పనిచేసిన ఆయన, అదే ఆసుపత్రి సూపరింటెండెంట్ గా విధులు నిర్వర్తించారు. సుమారు అర్ధ శతాబ్దం పాటు ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు విశేషంగా వైద్య సేవలు అందించారు. అప్పట్లో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో (నేటి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి) రోగుల ఇబ్బందులను గుర్తించి తన పదవీ కాలంలో ఎందరో దాతల సహకారంతో పలు భవనాలు నిర్మించి రోగులకు ఉత్తమ సేవలు అందించారు. తద్వారా ప్రభుత్వంతో పాటు పలు సంస్థల నుంచి ప్రశంసలు, అవార్డులు పొందారు. డాక్టర్ రామసుబ్బయ్య పెద్ద కొడుకు వై వి కె మోహన్ రావ్ భారత సైన్యంలో అత్యున్నత అధికారిగా లెఫ్టినెంట్ జనరల్ హోదాలో విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేశారు. రెండవ సంతానం వి.రమాదేవి వివాహనంతరం హోం మేకర్ గా ఉన్నారు. మూడవ సంతానం డాక్టర్ వై.మాధవి లత అనంతపురంలో ప్రముఖ చర్మవ్యాధి నివారణ నిపుణులుగా రైల్వే స్టేషన్ వద్ద ఆసుపత్రిను నిర్వహిస్తున్నారు నాలుగవ సంతానము అయిన రెండవ కొడుకు అయిన డాక్టర్ వై వెంకటేశ్వరరావు గుర్తింపు పొందిన పాథాలజిస్టుగా పని చేస్తూ రైల్వే స్టేషన్ వద్ద డయాగ్నస్టిక్స్ సెంటర్ ను నడుపుతున్నారు. ఈయనకు మొత్తం ఆరుగురు మనవడు, మనవరాలు ఉండగా, ముగ్గురు వైద్యులు కావడం విశేషం. సమాజ సేవకుడు, ప్రజల వైద్యుడు వై. రామసుబ్బయ్య మృతికి పలువురు ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.

# ప్రభుత్వ స్థలం కనపడిందా...! ఆ స్థలం గోవిందా...గోవింద...!

**ప్రభుత్వ స్థలమైనా ఇరిగేషన్ భూమైనా కబ్జాలు కామన్ ...! ప్రభుత్వ స్థలాల పై కన్నేసిన కబ్జారాయిళ్లు...! అధికారులు చర్యలుతీసుకోవాలంటున్న జగనన్నకాలనీవాసులు...!**



మున్సిపల్ రిజర్వు స్థలంలో అక్రమంగా నిర్మించిన కట్టడం



ఇరిగేషన్ స్థలంలో రాళ్లుతోలిన దృశ్యం

**ధర్మవరం, డిసెంబరు18,ప్రభాతవార్త**

ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరువైంది. ప్రభుత్వ స్థలం ఖాళీగా కనపడితే వెంటనే ఆ భూమిని కాజేసేందుకు ఏదో ఒక విధంగా రాజకీయపార్టీ నిగాని, కుల సంఘాలను కానీ అడ్డం పెట్టుకొని కబ్జాలకు తెరలేపుతున్నారు కొందరు అక్రమార్కులు. ముఖ్యంగా ధర్మవరం మున్సిపాలిటీ పరిసర ప్రాంతాల్లో ఉన్న విలువైన స్థలాలపై ఈ కబ్జారాయుళ్ల కన్ను పడింది. కన్ను పడిందే తడవుగా మున్సిపాలిటీ ప్రభుత్వ స్థలాలను ఏ విధంగా ఆక్రమించుకోవాలన్నది ప్రణాళికలు సిద్ధం చేసుకుని రంగంలోకి దిగిపోతారు. తాజాగా ధర్మవరం మున్సిపాలిటికి సంబందించి కొంతభాగం, ఇరిగేషన్ కు సంబంధించి దాదాపు 3 ఎకరాల భూమి ఉంది. కుణుతూరుపొలంలో సర్వేనెంబరు 426 లో మున్సిపాలిటీకి సంబదించి దాదాపు రెండుఎకరాలకు పైగా రిజర్వుస్థలం ఉంది. అదేవిధంగా ఇరిగేషన్ కు సంబందించి మరో 3 ఎకరాల దాకా ప్రభుత్వ భూమి ఉంది. అయితే కొందరు ఆ భూమిని అన్యాక్రాంతం చేసే పనిలో ఉన్నట్టు తెలుస్తోంది.ఇప్పటికే దాదాపు 50సెంట్ల దాకా అన్యాక్రాంతం చేసి కట్టడాలు కూడా మొదలు పెట్టారు. దీంతో అబివృద్ధి కార్యక్రమాల కోసం కేటాయించినస్థలాలు కబ్జాకు గురవుతుండటం పలు విమర్శలకు తావిస్తోంది. యథేచ్ఛగా స్థలాలను ఆక్రమణదారులు ఆక్రమిస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆ భూములపై ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు తగిన చొరవ చూపి కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు. జగనన్నకాలనీలో అభివృద్ధి కోసం దాదాపు 2ఎకరాలు కేటాయింపు: పట్టణ సమీపంలోని కుణుతూరు పొలంలో జగనన్న కాలనీని ఏర్పాటుచేశారు. అక్కడ దాదాపు 2వేలపట్టాలు గత ప్రభుత్వ హయాంలో కేటాయించినట్టు అధికారులు చెబుతున్నారు. అందులో గుడి, బడి, కమ్యూనిటీ హాల్, అంగన్వాడీ భవనానికి తదితర అభివృద్ధి కార్యక్రమాల కోసం మున్సిపల్ అధికారులు 2 ఎకరాలకు పైగా మిగతా 3 లో...

# ప్రజా సమస్యల పరిష్కారమే ఈ ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యత

**- అందుకే ప్రతి వారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం - క్యాంప్ కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్‌లో పరిటాల సునీత - కార్యకర్తలతో సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకున్న సునీత - కార్యకర్తలకు ఏ అవసరం ఉన్నా..నేరుగా నన్ను సంప్రదించాలన్న సునీత**







ఎమ్మెల్యే పరిటాల సునీతకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం,సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**రాప్తాడు, డిసెంబర్ 18 ప్రభాతవార్త**

ప్రజలు ఎక్కడా ఇబ్బందులు పడుకూడదని ఎప్పటికప్పుడు వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురం క్యాంప్ కార్యాలయంలో ఆమె ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలు చెప్పుకున్నారు. ప్రతి ఒక్కరితో ఓపిగ్గా మాట్లాడి.. వారి నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతపురంరూరల్‌మండలంలోని ఏ.నారాయణపురం పంచాయతీ నుంచి పాపంపేట పంచాయతీని ప్రత్యేక పంచాయతీగా చేయాలని ఎమ్మెల్యే సునీతకు స్థానికులు విజ్ఞప్తి చేశారు. దీనిపై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడుతామని హామీ ఇచ్చారు. ఆత్మకూరు మండలం పి.కొత్తపల్లి గ్రామంలో బీసీ కమ్యూనిటీ భవనం, మారెమ్మ అమ్మవారి దేవాలయానికి కాంపౌండ్ వాల్‌నిర్మాణం, భజనమందిరంకావాలని విన్నవించారు. సనప గ్రామంలో సిసి రోడ్లు కావాలని, మదిగుబ్బ గ్రామంలో డ్రైనేజీసమస్య పరిష్కరించాలని, మదిగుబ్బ తండా వరకు ఉన్న బి.టి రోడ్డు చెరువులోపాడైంది అదిమరమ్మతులు చేయించాలనికోరారు.అలాగే తండాలోవాటర్‌ట్యాంక్ ఏర్పాటు చేయాలని సిసి రోడ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. పంపనూరు గ్రామంలో సిసిరోడ్లు, సచివాలయమునకు కాంపౌండ్ వాల్, ఆంజనేయస్వామి భజనమందిరం కోసం అర్జీలు ఇచ్చారు. భూముల మ్యుటేషన్ గురించి విజ్ఞప్తి చేయగా తహసిల్దార్‌తో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. హౌసింగ్, పింఛన్ల కోసం అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ స్థానికంగా ఉన్న అధికారులు ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తే అవి మా వరకు రావన్నారు. కొన్ని చోట్ల సచివాలయం స్థాయిలోనే పరిష్కారమయ్యేవి ఉన్నాయన్నారు. ప్రజలు ఇచ్చిన అర్జీ గురించి వారికి సాధ్యాసాధ్యాలపై క్షుణ్ణంగా వివరించాలన్నారు. ఒక చిన్న నిర్లక్ష్యమే కొన్ని సార్లు పెద్దవి అవుతాయన్నారు. భూముల మ్యూటేషన్లకు సంబంధించి ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినా కొన్ని చోట్ల ఇంకా నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. మరోవైపు కార్యకర్తల సమావేశంలో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలు ఏవైనా ఇబ్బందులు ఉంటే నేరుగా నన్నే కలవాలన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ఏ ఒక్కరికి అన్యాయం జరగదని. వివిధ రూపాల్లో వారికి న్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నామని ఎమ్మెల్యే సునీత అన్నారు.

# ధాన్యం..దాచుకోలేని దైన్యం..!

**- శీతల గిడ్డంగిలో బట్టబయలైన మోసం - రక్షణ మరచి..భక్షణ మరిగిన నిర్వహకులు - పర్యవేక్షణ మృగ్యం..దోచుకోవడమే నైజం..!**









ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రీబాలాజీ కోల్డ్ స్టోరేజి, బాలాజీ కోల్డ్ స్టోరేజిలో రైతులు నిల్వ ఉంచుకున్న ధాన్యం, రైతుతో వసూలు చేసిన ఛార్జీల రసీదు,

**తాడిపత్రి, డిసెంబరు18, ప్రభాతవార్త:**

రెక్కలు ముక్కలు చేసుకొని, కష్టనష్టాలకు తట్టుకొని పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చులే అనే భరోసానిస్తాయని నమ్మే శీతల గిడ్డంగుల్లో కూడా దోచుకోవడమే నైజంగా మారుతోంది. అన్నదాతల పంట దిగుబడులకు రక్షణ కల్పిస్తాయనే నమ్మకం ఉన్న శీతల గిడ్డంగుల్లో వాటిని దాచుకోలేని దైన్యం కనిపిస్తోందని పలువురు రైతులు వాపోతున్నారు. వీటిపై పర్యవేక్షణ తమది కాదంటే తమది కాదని వ్యవసాయ అనుబంధ విభాగాల అధికారులు చెబుతుంటే అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు. తమకు జరిగిన మోసానికి ఏ విభాగపు అధికారులను సంప్రదించాలో తెలియక వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల వంటి అధికారుల చుట్టూ తిరిగి వేసారి చివరికి పోలీసులను ఆశ్రయించాల్సి వస్తోందని బాధిత అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శీతల గిడ్డంగుల్లో తమ పంట దిగుబడిని దాచుకుంటే ఎన్నేళ్లకైనా మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకుందామనే ఆశలపై వాటి నిర్వహకులు నీళ్లు చల్లుతున్నారు. విత్తనం కొనుగోలు నుంచి పంట విక్రయం వరకు ప్రతి చోట, ప్రతి సారీ మోసపోవాల్సి వస్తోందని, చివరికి ఈ శీతల గిడ్డంగిలో కూడా మోసపోవడం తప్పడం లేదని కర్షకులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

**:రక్షణ మరచి..భక్షణ మరిగి..!**

సంచికి రూ. 150 లు అద్దె, రూ. 10 లు బీమా, రూ. 20 లు లోడింగ్, రూ. 2 లు గుమస్తా మామూలు వెరసి ఒక సంచికి మొత్తం రూ. 182 లు వసూలు చేసుకుంటూ రైతుల సరుకును పక్కదారి పట్టిస్తున్న వైనం తాడిపత్రిలోని ఆటో నగర్ వద్దనున్న బాలాజీ కోల్డ్ స్టోరేజీలో చోటు చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కోల్డ్ స్టోరేజీలో సెనగలు, మినుములు, కందులు, ఒట్టి మెరపకాయలను రైతులు నిలువ చేసుకుంటూ ఉంటారు. ఇక్కడ రైతులకు చెందిన నాణ్యమైన ధాన్యాన్ని రైతులకు తెలియకుండా విక్రయించి వాటి స్థానంలో నాసిరకం ధాన్యాన్ని ఉంచడం, వ్యాపారస్తులు నిలువ ఉంచు'కొన్న' సరుకును వారికి తెలియకుండా అమ్మేసి తోచినంత చెల్లిస్తామనడం వంటి మోసాలు ఇక్కడ పరిపాటిగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత వ్యాపారస్తులకు, రైతులకు తెలియకుండా వారి ధాన్యాలను విక్రయించిన మాట వాస్తవమేనని, అమ్మిన సరుకుకు అమ్మిన ధర ప్రకారం నగదు చెల్లిస్తామని, లేదంటే ఆ సరుకును వెనక్కు తెప్పిస్తామని నిర్వహకులు చెబుతున్నారంటే వారి నిర్వహణ తీరు ఏ విధంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సరుకు మార్చడం వల్ల, తూకం తగ్గడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని, ఈ మోసాలపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక పోలీసుల చుట్టూ తిరగాల్సి వస్తోందని,జిల్లా స్థాయి అధికారులు స్పందించి మోసపోయిన తమకు న్యాయం చేయాలని బాధితులు పేర్కొంటున్నారు.

**:దాన్యం..దాచుకోలేని దైన్యం..!**



నారాయణస్వామి, బాధిత మినుము రైతు వెంగన్నపల్లి,



సుధీర్ కుమార్ గుప్తా, బాధిత వ్యాపారి తాడిపత్రి

తాడిపత్రిలోని బాలాజీ కోల్డ్ స్టోరేజీలో చోటు చేసుకున్న మోసాలకు బలైనవారిలో నారాయణస్వామి అనే రైతు, సుధీర్ కుమార్ గుప్తా అనే వ్యాపారి మాత్రమే నిర్వహకులపై పోరాటం కొనసాగిస్తున్నారు. వెంగన్నపల్లికి చెందిన నారాయణస్వామి తాను సాగుచేసి దిగుబడి సాధించిన 4,220 కిలోల మినప పంటను 76 సంచుల్లో ఈ స్టోరేజిలో 2024 డిసెంబరులో నిల్వ ఉంచాడు. ఇదే పంట దిగుబడిని 9 నెలల తర్వాత కోల్డ్ స్టోరేజీకి చెల్లించాల్సిన రుసుములన్నీ కలిపి రూ.7,500 లు చెల్లించి వ్యాపారస్తుడికి విక్రయించగా 80 కిలోల తూకం తగ్గాయి. సరుకు మార్చడం వల్ల, తూకం తగ్గడం వల్ల రూ. 30 వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు నారాయణస్వామి లబోదిబోమంటున్నాడు. కోల్డ్ స్టోరేజీ ప్రభావంతో మినుములు ఉబ్బడం వల్ల 75 కిలోలు తూకం పెరగాల్సింది పోయి 80 కిలోలు తగ్గడం ఏమిటని నిర్వహకులను ప్రశ్నిస్తే నీ సరుకును మేము మార్చలేదని, మేము తీసుకోలేదని నిర్వహకులు తనను దబాయిస్తున్నారని నారాయణస్వామి ఆక్రోశం వ్యక్తం చేస్తున్నాడు. ఇక తాడిపత్రికి చెందిన వ్యాపారి సుధీర్ కుమార్ గుప్తా తనరూ. 2 కోట్ల విలువైన 40 లారీల సరుకును ఇక్కడ నిల్వ ఉంచాడు. నాలుగేళ్లుగా నిల్వ ఉంచిన ఈ సరుకుపై కోల్డ్ స్టోరేజీ నిర్వహకులతో రుణం కింద లారీకి రూ. 4 లక్షల వంతున రూ. 1.60 కోట్లు తీసుకున్నాడు. కానీ ఈ వ్యాపారికి తెలియకుండా 2 లారీల సరుకును వేరొకరికి విక్రయించారు. అప్రమత్తమైన వ్యాపారి తన మొత్తం సరుకును పరిశీలించగా తన సరుకు ఉంచిన చోట కాకుండా ఎక్కడ పడితే అక్కడ పడేసి ఉండటం గమనించాడు. నీకు రుణం ఇచ్చాం కనుక నీ మొత్తం సరుకును అమ్ముకునే హక్కు మాకు ఉందంటూ, నీకు చెందిన అన్ని లారీల సరుకును అమ్ముకుంటామని తనను బెదిరించినట్లు బాధిత వ్యాపారి రూరల్ పోలీసులను ఆశ్రయించడం గమనార్హం. రెండు లారీల సరుకును అమ్మినమాట, రెండు లారీల సరుకును మార్చినమాట నిజమేనని, తాము అమ్మిన ధర ప్రకారం ఆ సరుకుకు డబ్బు చెల్లిస్తామని కోల్డ్ స్టోరేజీ నిర్వహకులు పోలీసు స్టేషన్ వద్ద పెద్ద మనుషుల ఎదుట అంగీకరించడం కొసమెరపు. ఈ సంఘటనలను పరిశీలించిన అన్నదాతలు కోల్డ్ స్టోరేజీ అంటేనే వణికి పోతున్నారు.

**:సరుకైనా ఇస్తాం..సొమ్మైనా చెల్లిస్తాం..!**

తాము చెప్పకుండా విక్రయించామనడం అవాస్తవమని, వారు ఆరోపిస్తున్నట్లు విక్రయించిన సరుకును వెనక్కు ఇస్తామని, లేదంటే మేము విక్రయించిన ధర ప్రకారం సొమ్మైనా చెల్లిస్తామని నిర్వహకులు చెబుతుండటం విశేషం. వేరొకరి సరుకులు బయటకు తీయడానికే సుధీర్ అనే వ్యాపారి సరుకులను పక్కకు తొలగించామని, సరుకుల్లో ఎలాంటి మార్పు చేయలేదని నిర్వహకులు పొంతన లేని సమాధానాలు చెబుతుండటం గమనార్హం.

## అవినీతి అక్రమాలు బయటపడ్డా

# రికవరీలు, చర్యలు నిల్..!

- -ఉపాధి హామీ సామాజిక తనిఖీలకు విలువే లేకుండా పోతున్న పరిస్థితి
- -గత ఏడాది జరిగిన సామాజిక తనిఖీలో రూ.9.22 లక్షల రికవరీకు ఆదేశం
- -ఒక్క పైసా కూడా వసూళు చేయకుండా ఉదాశీనంగా వ్యవహరించిన అధికారులు
- -అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంలోనూ మారని తీరు
- -గత ఏడాదికే దిక్కులేకపోగా మరొకమారు మొదలవుతున్న సామాజిక తనిఖీ
- -విమర్శలకు తావిస్తున్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారుల వైఖరి





**ఉరవకొండ, డిసెంబరు 18 ప్రభాతవార్త**

ఉపాధిహామీలో అ క్రమాలకు పాల్పడిన వారి నుండి సొమ్ము రికవరీ చేయడం, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంలో డ్వామా (జిల్లా నీటి యాజమాన్య సంస్థ) అధికారులు వ్యవహరిస్తున్న ఉదాశీన వైఖరితో సామాజిక తనిఖీలకు విలువే లేకుండా పోతోంది. పేద కూలీల కడుపుకొట్టి చేయని పనులు చేసినట్లు దొంగ మస్టర్లు వేసుకొని, బోగస్ జాబ్ కార్డులు, నకిలీ కూలీలను సృష్టించి లక్షలకు లక్షలు దోచుకున్నా అక్రమార్కుల నుండి దిగమింగిన సొమ్మును రికవరీ చేయకుండా కేవలం నోటీసులతో సరిపెట్టుకుంటూ పోతుండటం విమర్శలకు తావిస్తోంది. గత ఏడాది అక్టోబర్ నెలలో ఉరవకొండ మండలంలో జరిగిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో 9.22 లక్షల రూపాయలు రికవరీకు ఆదేశించినా ఇప్పుడు మరోక సామాజిక తనిఖీ ప్రారంభమవుతున్నా నేటికీ ఒక ్రపైసా రికవరీ చేయకుండా అధికారులు అక్రమాలను ప్రోత్సహించేలా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. వివరాల్లోకి వెళితే... వలసలను నివారించి కూలీలకు వారి స్వగ్రామాల్లోనే ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ప్రారంభించి చట్టాన్ని సైతం తీసుకొచ్చి కూలీలకు హక్కులను కల్పిం చింది. పనులు పార దర్శకంగా జరగాలని, ఎక్కడైనా అక్రమాలు జరిగితే వాటిని వెలికి తీసి నిధులు స్వాహాచేసిన వారిపై చర్యలు తీసుకునేలా చూడలన్న ఉద్దేశంతో ఏడాదికొక్కసారి సామాజిక తనిఖీలు నిర్వహిస్తూ ప్రజా వేదికల్లో అక్రమాలను బయట పెడుతూ వస్తున్నారు. ఈ క్రమంలోనే ఉరవకొండ మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికిగానుజరిగిన 9,15,44,366 రూపాయల విలువైన పనులపై గత ఏడాది అక్టోబర్‌లో సామాజిక తనిఖీబృందాలు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలు నిర్వహించి 22వ తేదీన నిర్వహించిన ప్రజా వేదికలో 78,66,935 రూపాయలు నిధులు దుర్వినియోగం అయినట్లు ఆధారాలతో బయటపెట్టారు. అయితే ఓపెన్ ఫోరంకు హాజరైన డ్వామా జిల్లా, విజిలెన్స్ అధికారులు సామాజిక తనిఖీ బృందాలు బయట పెట్టిన అవినీతి అక్రమాలను పరిశీలించి దుర్వినియోగమైన 78,66,935 రూపాయల్లో 62,11,720 రూపాయలను డ్రాప్ చేసి కేవలం 9,29,014 రూపాయలను మాత్రమే రికవరీకు ఆదేశించి, 7,26,201 రూపాయలను అక్రమాలను సరిచేసుకోవడానికి అవకాశం ఇచ్చి కేవలం 1,73,500 రూపాయలను ఫైన్ వేశారు. అయితే ఓపెన్ ఫోరం జరిగి ఏడాది పూర్తి అయినా ఇప్పటివరకు అక్రమాలకు పాల్పడిన వారి నుండి ఒక్క పైసా కూడా రికవరీ చేయకపోగా ఏ ఒక్కరిపైనా శాఖాపరమైన చర్యలు తీసుకోకుండా కేవలం నోటీసులిచ్చి చేతులు దులుపుకోవడం విమర్శలకు తావిస్తోంది. కొందరు అధికారులు, క్షేత్ర సిబ్బందితో కుమ్మక్కై పని చేయని, జాబ్ కార్డులు కూడా లేని బోగస్ కూలీలను సృష్టించి మస్టర్లువేసి, చేయని పనులను చేసినట్లు యం బుక్‌లు రికార్డులు చేసి అడిగేవారు లేరన్నట్టు లక్షలాది రూపాయలను అప్పన్నంగా దోచేసినా, ఊళ్లల్లోలేని ఎక్కడో కర్నాటక రాష్ట్రంలో ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, డాక్టర్లు,ఫైనాన్షియర్లు, వయోవృద్ధులుకూడా కూలిపనిచేసినట్లురికార్డులు సృష్టించినా బాధ్యులపైచట్టపరంగా చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈక్రమంలోనే 2024-25 ఆర్థిక సంవత్సరంలో మండలంలో ఉపాధిహామీ పథకంకిందజరిగిన 9,52,66,678 రూపాయలు విలువైన పనులపై సామాజిక తనిఖీ ప్రారంభమవుతోంది. ఈ తనిఖీలోనూ అక్రమాలు బయటపడినా పెద్దగా మార్పేమీ ఉండదని గత అనుభవాలను బట్టి స్పష్టమౌతోంది. దిగమింగిన సొమ్ము రికవరీలు, అక్రమార్కులపై చర్యలు ఊసే లేకపోతుండగా లక్షలాది రూపాయలు నిధులు ఖర్చుపెట్టి సామాజికతనిఖీలు చేపట్టడం ఎందుకన్న ప్రశ్న తలెత్తుతోంది. అక్రమార్కులకు వంతు పాడుతూపోతే తప్పు చేస్తే శిక్షింపబడుతామని, దోచేసిన సొమ్మును కక్కిస్తారన్న భయం ఎక్కడుంటుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఈవిషయమై ప్రత్యేకదృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

02ATP27_02ATP27.qxd 18-12-2025 PM 10:40 Page 1



## ప్రతి సోమవారం ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం



పిజిఆర్ఎస్ హెల్ప్ డెస్క్ దృశ్యం

బెలుగుప్ప, డిసెంబర్ 18 ప్రభాతవార్త

మండల కేంద్రంలో తహశీల్దారు కార్యాలయంలో గురువారం తహశీల్దారు అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం మండలంలో ఉన్న ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని పిజిఆర్ఎస్ హెల్ప్ డెస్క్‌ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో రైతులకు సంబంధించిన మ్యూటేషన్, రికార్డ్స్ ఆఫ్ ది రైట్స్, చిన్న చిన్న సమస్యలను, స్థల విషయాలు, సోమవార మే కాకుండా అన్ని వేళల్లో కూడా సమస్యలను పరిష్కరిస్తామని మండలంలో ఉండే సమస్యలను పరిష్కరించకుంటే డివిజన్ స్థాయిలో, కలెక్టర్ కార్యాలయంలో సంప్రదించ వచ్చని తెలిపారు. దీనిని ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీచేసిన అధికారులు

కనేకల్ డిసెంబర్ 18 ప్రభాతవార్త


మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు

అనంతపురం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖకు చెందిన డీసీ నాగమద్దయ్య, ఏసీ హనుమంత రావు, ఏఈఎస్ శ్రీరామ్‌లు కనేకల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో జరుగుతున్న కార్యకలాపాలపై వారు తనిఖీలు నిర్వహించారు. స్టేషన్‌లో నమోదైన కేసులు, అక్రమ మద్యం నివారణ చర్యలు, తనిఖీలు, గస్తీ వివరాలు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా అక్రమ మద్యం, గంజాయి వంటి నిషేధిత పదార్థాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలిగి, చట్ట వ్యతిరేక కార్యకలాపాల పై సమాచారం అందించేలా అవగాహన కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలించి అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రస్తా సమస్య పరిష్కారం

### - తహసీల్దార్ ఈశ్వరమ్మ


రస్తా సమస్యను పరిష్కరిస్తున్న రెవెన్యూ అధికారులు

శెట్టూరు, డిసెంబర్ 18 ప్రభాతవార్త

గత కొంత కాలంగా ఉన్న రాస్తా సమస్యను గురువారం తహసీల్దార్ ఈశ్వరమ్మ పరిష్కరించారు. మండల పరిధిలోని చింతర్లపల్లి గ్రామ పంచాయితీ నందు గల కరిడిపల్లి గ్రామంలో ఉన్న సర్వే నెంబర్103నందు 8మంది రైతులు రాస్తాలేక చాలా ఇబ్బందులు పడుతుండేవారు. ఈ సమస్య పై ఆరైతులు పలుమార్లు తహసీల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. అందుకు తహసీల్దార్ ఈశ్వరమ్మ గురువారం ఆగ్రామానికి వెళ్లిఅక్కడి సమస్యను చూసి 8మంది రైతులకు రాస్తా సమస్య పరిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ గౌతమ్, మండల సర్వేయర్ మున్వర్ భాషా, విఆర్ఓ తిప్పేస్వామి, సర్వేయర్లు ,రైతులు పాల్గొన్నారు.

## ఐటిడిపి కోఆర్డినేటర్ లోకేష్ ను పరామర్శించిన రాహుల్

బ్రహ్మసముద్రం డిసెంబర్ 18 ప్రభాతవార్త


లోకేష్‌ను పరామర్శిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు బ్రహ్మసముద్రం మండలం తెలుగు దేశం పార్టీ ఐ టీడీపీ కోఆర్డినేటర్ లోకేష్ కు యాక్సి డెంట్‌జరిగి హాస్పిట ల్ నుండి డిశ్చార్జ్ కావడం జరిగింది ఈ విషయం తెలుసుకుని రాహుల్ మండల పార్టీ అధ్యక్షులు పాలబండ్ల శ్రీరాములు జడ్పిటిసి ప్రభావతమ్మ చేరుకొని అతనిస్వగృహంలో అతనిఆరోగ్యం గురించి అన్నిరకాలుగా అండగా ఉంటామని చెప్పడం జరిగింది. టిడిపి కార్యకర్తలకు పార్టీ ఎప్పుడు అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొనడం జరిగింది.

## మండలంలో పలు పాఠశాలల్లో స్టడీ మెటీరియల్ పంపిణి

### మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేత


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

గోరంట్ల డిసెంబర్ 18 ప్రభాతవార్త

గోరంట్ల మండలం పాలసముద్రం ఉన్నత పాఠశాల, మల్లాపల్లి ఉన్నత పాఠశాల మరియు మందలపల్లి ఉన్నత పాఠశాల ల ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతన యుటిఎఫ్ నాయకుల సమక్షంలో గోరంట్ల మండలం మాజీ ఎంపీపీ నిమ్మల విద్యా ధరణి సహకారంతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. రాబోవు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు బాగా చదువుకొని మంచి ఉత్తీర్ణత ను సాధించాలని స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు యుటిఎఫ్ నాయకులు మాజీ ఎంపీపీ శ్రీమతి నిమ్మల విద్యాధరణి తో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ చింతా భాస్కర్ రెడ్డి మందలపల్లి కన్నారెడ్డి జయశంకర్ రెడ్డి పుద గుండ్లపల్లి సాయి, వృషభ దేవుడు నాగమణి, దేవాంగం నరేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పిస్తాం


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ డి,ఇ రమేష్ కుమార్

హిందూపురం టౌన్ డిసెంబర్ 18 ప్రభాతవార్త

హిందూపురం పట్టణంలోని మద్దిరెడ్డిపల్లిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హిందూపురం మున్సిపల్ చైర్మన్ డి,ఇ రమేష్ కుమార్ స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. వార్డు పర్యటనలో భాగంగా గురువారం ముదిరెడ్డిపల్లిలో పర్యటించిన చైర్మన్ కు రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ నీటి సరఫరా తదితర సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకురాగా వెంటనే వాటిని పరిష్కరించవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇటీవల విడుదలైన 92 కోట్ల రూపాయల నిధులతో వార్డు సమస్యలు పరిష్కరించడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## కౌన్సిల్‌లో ప్రత్యేక తీర్మానం చేయండి


మున్సిపల్ చైర్మన్ కు వినతి పత్రం అందజేస్తున్న జిల్లా సాధన సమితి నాయకులు

హిందూపురం డిసెంబర్ 18 ప్రభాతవార్త

హిందూపురం జిల్లా కొరకు మున్సిపల్ ప్రత్యేక సమావేశం నిర్వహించి కౌన్సిల్లో ఏకగ్రీవ తీర్మానం చేయాలని జిల్లా సాధన సమితి నాయకులు గురువారం హిందూపురం మున్సిపల్ చైర్మన్ డి,ఇ రమేష్ కుమార్ ను కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా నేడు జరిగే ర్యాలీలో పాల్గొనాలని మున్సిపల్ చైర్మన్ ను ఆహ్వానించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురం కేంద్రంగా జిల్లా చేయాలని పోరాడారని ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకుని ముఖ్యమంత్రితో మాట్లాడి హిందూపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు అయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. ఈసందర్భంగా మున్సిపల్‌చైర్మన్ మాట్లాడుతూ జిల్లాకోసం ఉద్యమం చేపడుతున్న జిల్లా సాధన సమితి నాయకులను అభినందించారు. జిల్లా కొరకై కౌన్సిల్ ఏర్పాటు విషయాన్ని ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకువెళ్లి చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. జిల్లా ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇస్తామని చైర్మన్ తెలిపినట్లు జిల్లా సాధన సమితి నాయకులు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా సాధన సమితి గౌరవ అధ్యక్షుడు బాలాజీ మనోహర్, అధ్యక్షుడు ఇందాద్, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణదుర్గం నియోజకవర్గానికి వచ్చిన 27 ట్రాలీలు, డస్ట్ బిన్నులు

### అన్ని గ్రామ పంచాయతీలకు ప్రతిపాదనలు పంపలేని వైనం

### పారిశుద్ధ పరికరాల పంపిణీ పై ఎంపీడీవో ధనుంజయనాథ్ వివరణ

కళ్యాణదుర్గం, డిసెంబర్ 18 ప్రభాతవార్త :


కళ్యాణదుర్గం మండల పరిషత్ కార్యాలయానికి పంపిన పారిశుద్ధ్య ట్రాలీలు, చెత్త సేకరణ కుండీలు

స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర నినాదంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పారిశుద్ధ్యనికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా అనేక పథకాలు అమలు చేస్తున్నారు. పారిశుధ్యాన్ని అమలు చేయడానికి కోట్ల రూపాయలలో నిధులు వ్యయం చేస్తున్నారు. అయితే గ్రామ పంచాయితీల పరిధిలో స్వచ్ఛతను పరిశుభ్రతను అమలు చేయడానికి అవసరమైన పారిశుద్ధ్య పరికరాలు సమకూర్చడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గురువారం కళ్యాణదుర్గం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పారిశుధ్య పరికరాల పంపిణీ కార్యక్రమం వివాదమైంది. ఈ నేపథ్యంలో ఎంపీడీవో ధనుంజయనాథ్ ప్రభాతవార్త వివరణ కోరగా కళ్యాణదుర్గం మండలానికి నారాయణపురం, తిమ్మసముద్రం, చాపిరి, బట్టువానిపల్లి గ్రామాలకు మాత్రమే చెత్తకుండీలు, ట్రాలీలు వచ్చినట్లు తెలిపారు. గతంలో ఆయా గ్రామ పంచాయతీల సచివాలయ కార్యదర్శులు పంపిన సమాచారం మేరకు పరికరాలు వచ్చినట్లు అభిప్రాయ పడ్డారు. ఇదిలా ఉండగా కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలో కళ్యాణదుర్గం 15, కంబదూరు 12, సెట్టూరు9, కుందుర్పి 10, బ్రహ్మసముద్రం 13 ఐదు మండలాల పరిధిలో సుమారు 59 గ్రామపంచా యతీలు ఉన్నాయి. అయితే కళ్యాణదుర్గం మండలానికి 5, కంబదూరు మండలానికి9, శెట్టూరు మండలానికి3, కుందుర్పి మండలానికి2, బ్రహ్మసముద్రం మండలానికి8 వంతున చెత్త కుండీలు ర్యాలీలు వచ్చినట్లు ఎంపీడీవో ధనుంజయనాథ్ తెలిపారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీలను అభివృద్ధి దిశగా తీసుకువెళ్లాలని స్థానిక ఎమ్మెల్యే నిత్యము అభివృద్ధి ఆలోచనలు చేస్తున్న నేపథ్యంలో ఒక పంచాయతీకి వస్తే మరో పంచాయతీకి పారిశుధ్య పరికరాలు రాకపోవడంతో అధికారుల అసమర్థతే కారణమని భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అన్ని గ్రామ పంచాయతీలకు అవసరమైన పారిశుధ్య పరికరాలు మంజూరు చేయించేందుకు సంబంధిత అధికారులు కృషి చేస్తారో లేదో వేచి చూడాల్సి ఉంది.

## మండలానికి 7 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సులు

### -స్వచ్ఛభారత్ కింద ఒక్కో కాంప్లెక్స్‌కు 3 లక్షల రూపాయల నిధులు

### -తహశీల్దార్, ఫైర్, గవిమఠం కార్యాలయాల్లో మొదలైన నిర్మాణాలు


మండల తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో నిర్మిస్తున్న టాయిలెట్లు

ఉరవకొండ, డిసెంబరు 18 ప్రభాతవార్త

ఉరవకొండ మండలానికి స్వచ్ఛభారత్ కింద 7 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సులు మంజూరు అయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఐజయ్య తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ఒక్కో యూనిట్‌కు 3 లక్షల రూపాయలు నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఇందులో తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో 4 యూనిట్లు, పాత బస్టాండు, విపత్తు నివారణ అగ్నిమాపకశాఖ కార్యాలయం, గవిమఠం ఆవరణంకు ఒక్కో యూనిట్ మంజూరైందన్నారు. ఇప్పటికే తహశీల్దార్ కార్యాలయంతోపాటు గవిమఠం, విపత్తు నివారణ, అగ్నిమాపకశాఖ కార్యాలయం ఆవరణాల్లో నిర్మాణాలు ప్రారంభమయ్యాయన్నారు. పాత బస్టాండులో నిర్మాణానికి స్థలంను ఎంపిక చేయాల్సి ఉందన్నారు. ఒక్కో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ యూనిట్‌లో రెండు యూరినర్స్, రెండు టాయిలెట్లు ఉంటాయన్నారు. వివిధ పనుల నిమిత్తం, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలకు ప్రజలు ఎక్కువగా వస్తుంటారు కనుక మండల తహశీల్దార్ కార్యాలయానికి 4 యూనిట్లు మంజూరు అయ్యాయని ఏఈ వివరించారు.

## కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ సిబ్బందికి ప్రత్యేక శిక్షణా తరగతుల నిర్వహణ

కళ్యాణదుర్గం రూరల్ డిసెంబర్ 18 ప్రభాతవార్త


శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం డివిజన్ ఏడిఏఎ న్‌పి ఎల్లప్ప ఆధ్వ ర్యంలో కృషి విజ్ఞాన కేంద్రము ఫీల్డ్ ఎక్స్టెన్షన్ ట్రైనింగ్ సంబంధించి ఒకరోజు శిక్షణా కార్యక్రమంను స్థానిక కృషివిజ్ఞానకేంద్రం నందు గురువారం నిర్వహించారు కళ్యాణదుర్గం డివిజన్లోని ఆరుమండలాల రైతుసేవాకేంద్రం సిబ్బందికి ఖరీఫ్ పంటలో వేసే కంది వేరుసెనగ ఆముదము మొక్కజొన్న టమోటా అరటి ఇలా వివిధ రకాలైన పంటల యొక్క యాజమాన్య పద్ధతులను అనగా విత్తనంనుండి అమ్మడంవరకు రైతుసేవసిబ్బంది రైతులకు తెలియజేయాల్సిన అంశాలపై కె వి కె ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఈ చంద్రాయుడు వివరించారు. శాస్త్రవేత్త మల్లికార్జున వేరుశనగ యొక్క సస్య రక్షణ చర్యల గురించి తెలపగా శాస్త్రవేత్త యుగంధర్ హార్టికల్చర్ అరటి టమోటా బొప్పాయి చీని లాంటి పంటలపై యాజమాన్య పద్ధతులను తెలియజేసారు. ఖరీఫ్ రబీ సీజన్లో పంటల పండించడంలో రైతులకు ఇవ్వాల్సిన సలహాలు సూచన మెలకువల గురించి ప్రస్తుత సాంకేతిక విధానాలను వివరించారు. సిఫార్సు చేయాల్సినటువంటి మందుల గురించి వివిధ దశలలో పంటలకు వాడాల్సిన మందుల మోతాదుల గురించి తెలిపారు శిక్షణ కార్యక్రమంలో 6 మండలాల వ్యవసాయ అధికారులు శ్రవణ్ కుమార్, పృధ్వి సాగర్, విజయ్ కుమార్, గోపాల్, మహేష్ ,వాసుకి రాణి కె.వి.కె సైంటిస్టులు బాలాజీ నాయక్ మల్లికార్జున హరని శిరీష యుగంధర్ మరియు ఆరు మండలాల రైతు సేవ కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియోను విజయవంతం చేయండి

గుత్తి, డిసెంబర్ 18 ప్రభాతవార్త


కమీషనర్ మాట్లాడుతున్న దృశ్యం

ఈనెల 21వ తేదీ ఆదివారం నిర్వహించు పల్స్ పోలియో కార్య క్రమాన్ని విజయ వంతం చేయాలని మున్సిపల్ కమీషనర్ జబ్బార్‌మియా పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం పల్స్ పోలియో నిర్వహణపై ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, మున్సిపల్‌అధికారులు, శానిటేషన్‌సెక్రెటరీలతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు, సిబ్బందికి కార్యాచరణ సూచనలు అందజేశారు. 21న ఆదివారం 0-5సంవత్సరాల పిల్లలకుపోలియో చుక్కలు వేయాలన్నారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు 99 శాతంపోలియో పూర్తి చేయించి మిగిలిన వారికి ఇంటింటికి వెళ్లి పూర్తి చేయాలని తెలిపారు. ఆదివారం నాడు సెలవు కారణంగా ముందు రోజు శనివారం అంగన్‌వాడి సెంటర్లు, సచివాలయాలు, కేటాయించిన కేంద్రాల్లో సౌకర్యాలను ముందు రోజే ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో డిఈఈహేమచంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా, హెల్త్ సెంటర్స్ డాక్టర్లు ఆయోష అంజూమ్, అమర్నాథ్, రమ్య తేజ, డిపిఒ నరేష్, శానిటేషన్ సెక్రెటరీలు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీ విభజనపై గ్రామసభ

గుడిబండ డిసెంబర్ 18 ప్రభాతవార్త


గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని ముత్తుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ విభజనపై సర్పంచ్ జగదాంబ, పంచాయతీ కార్యదర్శి అమరేష్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీని విభజించాలనే అంశంపై గ్రామ పంచాయతీ ప్రజలతో గ్రామసభ నిర్వహించి వారి సలహాలు, సూచనలు, అభ్యంతరాలను స్వీకరించారు. ఈ క్రమంలో ముత్తుకూరు గ్రామ పంచాయతీని మూడు పంచాయతీ లుగా విభజించడానికి వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనరసప్ప, సింగిల్ విండో డైరెక్టర్ ప్రకాష్, గ్రామపంచాయతీ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## యూరియా కలిపిన నీటిని తాగి 11 గొర్రెలు మృతి

### గొర్రెల కాపరికి లక్ష రూపాయలు పైగా నష్టం.

కొత్తచెరువు డిసెంబర్ 17 ప్రభాతవార్త.


మృతి చెందిన గొర్రెలు

మొక్కజొన్న పంటకి యూరియా కలిపిన నీటిని డ్రిప్పు ద్వారా పంపడానికి సిద్ధం చేసిన నీటిని తాగి 11 గొర్రెలు మృతిచెందిన సంఘటన చోటుచేసుకుం ది. గ్రామస్తులు గొర్రెల కాపరి తెలిపిన వివరాల మేరకు కొత్తచెరువు మండలం కోడప గాని పల్లి పంచాయతీ వేములేటి పల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి మట్టి శ్రీనివాసులు బుధవారం గొర్రెలను మేతకు తీసుకువెళ్లగా మధ్యాహ్నం సమయంలో మొక్కజొన్న పంటకు డ్రిప్పు ద్వారా యూరియా కలిపిన నీటిని సిద్ధం చేసి ఉండగా సమీపంలో ఉన్న గొర్రెలు ఆ నీటిని తాగడంతో అక్కడికక్కడే మొత్తం 11 గొర్రెలు మృత్యువాత పడ్డాయని గొర్రెల కాపరి మట్టి శ్రీనివాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు మృతిచెందిన గొర్రెలు విలువ దాదాపు ఒక లక్ష రూపాయలు పైగా ఉంటా దని ఆయన తెలిపారు . గొర్రెలే జనాధారంగా చేసుకొని జీవనం సాగిస్తున్న ఆ గొర్రెల కాపరికి ఒక్కసారిగా 11 గొర్రెలు మృత్యువాత పడడంతో గుండె కోత గురయ్యారు స్థానికులు నష్టపోయిన గొర్రెల కాపరి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## ఎన్నెన్నో పదవుల రాజా ఈ ఎమ్మెల్యే

అగళి, డిసెంబర్ 18 ప్రభాతవార్త


ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

ఎమ్మెల్యే ఎంఎస్.రాజుకు ఎన్నెన్నో పదవులు అందుతున్నాయని, పదవుల రాకతో ఆయన రారాజుగా ఎదుగుతున్నారని అగళి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులుగా, ఎమ్మెల్యేగా, టిటిడి మెంబర్‌గా కొనసాగుతుండగా గత రెండు రోజుల క్రితం సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షుని పదవి వరించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ కష్ట సమయాల్లో పార్టీకి అండగా ఉంటూ పార్టీ పురోగాభివృద్దికి నిరంతరం శ్రమించారని అలాంటి శ్రమించే నాయకునికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పదవులు ఇస్తున్నారని కొత్తగా జిల్లా అధ్యక్షుని పదవి వరించడం సంతోషించ దగ్గ విషయమని మండల ప్రజలు అంటున్నారు. అతను కేవలం రాజు కాదు, పదవులకే రాజు. అతని ముందుకు పదవులు వెతుక్కుని వస్తున్నాయని, అందుకు ఆయన పడ్డ శ్రమే నిదర్శనమన్నారు. మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఎంఎస్.రాజుకు పదవులు రావడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పదవ తరగతి విద్యార్థుల వంద రోజుల ప్రణాళికపై సమీక్షా సమావేశం


సూచనలు సలహాలు ఇస్తున్న ఎంఈఓ లక్ష్మన్న

కనేకల్ డిసెంబర్ 18 ప్రభాతవార్త

పదవ తరగతి విద్యార్థుల 100 రోజుల ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలనే లక్ష్యంతో కనేకల్ మండలంలో మండల స్థాయి అధికారులు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో విజయసింహ రెడ్డి, ఎమ్మార్వో బ్రహ్మయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమిష్టిగా పనిచేయాలని సూచించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ఉత్తీర్ణత శాతం సాధించాలని, మండలంలోని పదవ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థి 100 రోజుల ప్రణాళికలో భాగంగా పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని, పాఠశాలలో నిర్వహించే ప్రతి పరీక్షను తప్పనిసరిగా రాసేలా విద్యార్థులను ప్రోత్సహించాలని హెడ్మాస్టర్లకు స్పష్టమైన దిశానిర్దేశాలు చేశారు. ఈ సమావేశంలో ఎమ్మార్వో బ్రహ్మయ్య, ఎంపీడీవో విజయసింహ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో చంద్రమోళి, ఎంఈఓ-1 లక్ష్మన్న, ఎంఈఓ-2 శంకర్‌తో పాటు మండలంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## కరాటేలో గోల్డ్ మెడల్ సాధించిన హన్మిత రెడ్డి

### అభినందించిన సిఎండబ్ల్యూ అధికారి శేషాద్రి..


బంగారు పథకం సాధించిన హన్మిత రెడ్డి


కరాటే లో గోల్డ్ మెడల్ సాధించిన హన్వితరెడ్డి ని అభినందిస్తున్న అధికారులు

గుంతకల్ రైల్వే డిసెంబర్ 18 ప్రభాతవార్త

గుంతకల్ రైల్వే డివిజన్ సిఎండబ్ల్యూ విభాగంలో పనిచేయుచున్న రైల్వే ఉద్యోగిరాలు విష్ణు ప్రియ కూతురు హన్విత రెడ్డిని డిపో మేనేజర్ శేషాద్రి అభినందించారు. గుంతకల్ పట్టణంలో ఎస్ గోస్ రాయ్ లో కరాటే విద్య పొందుతున్న హన్వితారెడ్డి కర్నూలు పట్టణంలో సౌత్ ఇండియా పోటీలలో గోల్డ్ మెడల్ సాధించింది కుమితీలో బంగారు పథకం సాధించింది. అలాగే కటాస్ లో బ్రౌన్స్ మెడల్ ను సాధించినారు. శేషాద్రి మాట్లాడుతూ రైల్వేలో ఉద్యోగుల పిల్లలు చదువులో ఆటలో ముందుఉండాలని రైల్వే వారి పిల్లలకు అనేక సౌకర్యాలు కల్పించిందన్నారు. డిపోలో పనిచేస్తున్నటువంటి విష్ణుప్రియ కుమార్తె హన్విత రెడ్డి ని ఇలాగే కరాటేలో మరెన్నో పథకాలను గెలవాలని అలాగే జాతీయస్థాయిలో గెలవాలని ఆ చిన్నారిని ప్రోత్సహించారు. అలాగే హిందూపూర్ లో జరిగినటువంటి స్కూల్ గేమ్స్ లో కూడా చిన్నారి హన్వితారెడ్డి డిస్టిక్ లెవెల్ నుంచి స్టేట్ లెవెల్ కి సెలెక్ట్ అయిందిన్నారు. సెవెంత్ నేషనల్ హప్కికిడో లో కూడా చిన్నారి హన్విత రెడ్డి కోల్కత్తాలో కూడా ద్వితీయ స్థానం లో నిలిచిందన్నారు. రాబోయే రోజులలో హన్మిత రెడ్డి కచ్చితంగా నేషనల్ లెవెల్ లోకి వెళ్లి సెలెక్ట్ అవ్వాలని వారి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ మాస్టర్ దినేష్ మరియు చంద్ర కాంత్, శేఖర్ మాస్టర్, జీవన్ బాబు, మాధవరెడ్డి పాల్గొన్నారు.

## వివాహ వయసు నిండకముందే వివాహం చేసుకోవద్దు!..ఏజీసిడిఓ అనిత

బత్తలపల్లి, డిసెంబర్ 18 ప్రభాతవార్త



కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో బాల్య వివాహాలపై మాట్లాడుతున్న ఎజిసిడిఓ

చదువుకునే వయసులో తల్లిదండ్రులు చెప్పిన వివాహాలు చేసుకోవద్దని ఏజిసిడిఓ అనిత విద్యార్థినులకు సూచించారు. గురువారం మండలంలోని సంజీవపురం వద్ద గల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో ప్రిన్సిపాల్ గుల్జార్ బేగం అధ్యక్షతన బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏజీసిడిఓ అనిత మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని వయసు నిండకముందే పిల్లలకు పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు నిండకముందే, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండకముందే పెళ్లి చేయవద్దన్నారు. పేదరికం వల్ల తల్లిదండ్రులు ఆడపిల్లను భారంగా భావించి, చదువు లేకపోవడం, అవగాహన లోపం వల్ల చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేస్తున్నారన్నారు. బాల్య వివాహాల వల్ల పిల్లల జీవితం దెబ్బతింటుందని చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల తల్లీబిడ్డల ప్రాణాలకు ప్రమాదం ఉంటుందని పోషకాహార లోపం ఏర్పడుతుందన్నారు. బాల్య వివాహం చేయడం, చేయించడం, పాల్గొనడం కూడా నేరమేన్నారు. ప్రిన్సిపాల్ గుల్జార్ బేగం మాట్లాడుతూ చదివే వయసులో మీ తోటి విద్యార్థినులకు పెళ్లిళ్లు చేస్తుంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పోలీసులు, అంగన్వాడి సిబ్బంది దృష్టికి తీసుకువచ్చి బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందని సూచించారు. కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

03ATP18_03ATP18.qxd 18-12-2025 PM 11:39 Page 1



## వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఉప్పరపల్లి సర్పంచ్ కుటుంబ సభ్యులు



వైయస్ జగన్మోహన్ రెడ్డికి జన్మది న శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం.

అనంతపురం రూరల్, డిసెంబర్ 18 ప్రభాతవార్త: వైఎస్ఆర్సిపిఅ ధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్‌రెడ్డి ని బు ధవారం తాడేపల్లి పార్టీ కార్యా లయంలో అనంత రూరల్ మండ లం ఉప్పరపల్లి గ్రా మ సర్పంచ్ బి. సావిత్రి శ్రీనివాసులు, కుటుంబ సభ్యులతోమర్యాద పూర్వకంగా కలిసి ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి ముందస్తు జన్మది న శుభాకాం క్షలు తెలిపిన అనంత రూరల్ మండలం ఉప్పరపల్లి గ్రామ సర్పంచ్ బి. సావిత్రి శ్రీనివాసు లు, కుమారుడు బి. అరుణ్ కుమార్, కుమార్తె బి విద్య తదితరులు.

## కుట్టు మిషన్లు పంపిణీ..



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న నారాయణస్వామి.

అనంతపురం రూరల్, డిసెంబర్ 18 ప్రభాతవార్త : అనంత రూరల్ మం డలం కురుకుంటగ్రామ పంచా యతీ లోని మహిళలకుమాజీ మంత్రి, రాప్తా డు ఎమ్మెల్యే పరిటాల సునీత సహకా రంతో గ్రామ సరోజినీ సంస్థ ద్వారా కురుగుంట గ్రామంలో కుట్టు మిషన్ల శిక్షణ ఇచ్చిన వారికి సబ్సిడీ ద్వారా కుట్టుమిషన్లు పంపిణీ చేయడం జరిగిందని కురుకుంట గ్రామ టిడిపి నాయకుడు, రాప్తాడు నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు నారాయణస్వామి తెలిపారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ కేశవరెడ్డి



పార్థివ దేహానికి నివాళులర్పిస్తు న్న బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డి

గార్లదిన్నె,డిసెంబర్ 18, ప్రభాత వార్త: అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామానికి చెందిన బాబయ్య అత్త ఎం. జమ్మక్క మృతి చెందిన విషయం తెలు సుకున్న ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి గారు గురువారం కుటుంబ సభ్యు లను పరామర్శించారు. ఈ సందర్భంగా పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను ఆదరించి, అధైర్య పడవద్దని, తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరు-ముంటిమడుగు కొత్తూరు రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ కేశవరెడ్డి.

గార్లదిన్నె, డిసెంబర్ 18,ప్రభాత వార్త: అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండల పరి ధిలోని కల్లూరు నుండి ముంటిమడుగు కొత్తూరు వరకు జరుగుతున్న తారు రో డ్డు నిర్మాణ పనులను ఉమ్మడి అన ంతపురం జిల్లా ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి స్థానిక నాయ కులతో కలిసి పరిశీలించారు.ఈ సంద ర్భంగా స్థానిక నాయకులు, రైతు లతో చర్చించి రోడ్డు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికా రులకు సూచిం చారు. రైతులు సహకరించాలని కోరారు.అనంతరం కేశవరెడ్డి మాట్లా డుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని, కల్లూరు–ముంటిమడుగు కొత్తూరు మార్గం సరిగా లేకపోవడంతో తారు రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్ర మం లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు..

## పంచాయితీలు పరిశుభ్రంగా ఉంటే రాష్ట్రం కూడ పరిశుభ్రంగా ఉంటుంది : ఎంపీపీ దాసరి సునీత



ట్రైసైకిళ్ళను పంపిణీ చేస్తున్న ఎంపీపీ సునీత,ఎంపిడివొ సాల్మాన్

బుక్కరాయసముద్రం, డిశంబర్ 18 ప్రభాతవార్త గ్రామ పంచాయితీలు పరిశు భ్రంగా ఉంటే మన రాష్ట్రం కూడ పరిశుభ్ర ంగా ఉంటుందని ఎంపీపీ దాసరి సునీత,ఎంపీడివో సాల్మాన్ అన్నారు. గురువారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ఎంపీడిఓ కార్యాల యంలో ఎమ్మెల్యే బండారు శ్రావ ణిశ్రీ ఆదేశాల మేరకు స్వచ్ఛఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయితీలకు ట్రై సైకిళ్ళను తడిచెత్త పొడిచెత్త వేరు చేసే డస్ట్ బిన్లను పంపిణీచేశారు.ఈ సందర్భంగ ఎంపీపీ దాసరి సునీత మాట్లడుతూ ముఖ్య మంత్రి నారాచంద్ర బాబు నాయు డు,ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ గ్రామాల పరిశుభ్రంగా ఉండే ందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ప్రతి నెల నాల్గవ శనివారం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమంలో వారితోపాటు డిప్యూటీ ఎంపిడివో సదాశివమ్,సుకన్య,పిఆర్ ఇంజనీర్ మద్దిలేటి, పంచాయితీ సెక్రటరీలు రామాంజనేయులు, మురళి,రేఖ,శారద, చిన్నరాయుడు,తోపాటు టిడిపి నాయకులు బుల్లే నారాయణస్వామి, తదితి రులు పాల్గొన్నారు.

## చిరుధాన్యాల యొక్క వివిధ అంశాలపై లఘు చిత్రం పోటీ

### -అనంత సుస్థిర వ్యవసాయ వేదిక కన్వీనర్ వై.వి.మల్లారెడ్డి

అనంతపురం బ్యూరో, డిసెంబరు 17 ప్రభాతవార్త

అనంత సుస్థిర వ్యవసాయ వేదిక ఆధ్వర్యంలో చిరుధాన్యాల యొక్క వివిధ అంశాలపై 60 సెక్షన్ల లఘు చిత్రం (షార్ట్ ఫిల్మ్) రీల్ తయారీ పోటీ లను నిర్వహించడం జరుగుతోందని ఆసక్తిగలవారు పాల్గొనాలని వేదిక కన్వీనర్ వై.వి.మల్లారెడ్డి కోరారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వై.వి.మల్లారెడ్డి మాట్లాడుతూ చిరుధాన్యా లను పెంచడం, చిరుధాన్యాల విలువ జోడింపు, చిరుధాన్యాల యొక్క పంట/వంటకాలు, చిరుధాన్యాల వినియోగం–ఆరోగ్య ప్రయోజనాలు, చిరుధా న్యాల యొక్క వినూత్న మార్కెటింగ్ అంశాల్లో ఏదో ఒక అంశంపై లఘు చిత్రం రీల్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు. రీల్స్‌ను తెలుగు, హిందీ, ఇంగ్లీషులో తయారు చేయవచ్చన్నారు. అన్ని వయసుల వారు పాల్గొన వచ్చని, అయితే ప్రతి వ్యక్తి ఏదైనా ఒక భాషలో, ఒక అంశంమీద మాత్రమే సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఆడియో, వీడియో ఫైల్ ఎంపీ4 ఫార్మెట్ లో ఉండాలన్నారు. ఈ ఎంట్రీ లను, ఫైళ్లను ఈనెల 22వ తేదీ మధ్యాన్నం 12 గంటలులోగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. ప్రతి కేటగిరిలో మోదటి రెండు ఎంట్రీలకు 2026 జనవరి రెండవ వారంలో అనంతపురంలో జరిగే మిల్లెట్ మేళా యొక్క మూడవ ఎడిషన్‌లో ప్రశంసా పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. అన్ని రీల్స్, షార్ట్ ఫిల్మ్‌లను మూడు రోజుల పాటు వేదికవద్ద ప్రదర్శించి సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తామని వై.వి.మల్లారెడ్డి వివరించారు. మీ వీడియోలను mlletmela26 gmail.com మెయిల్‌కు ఐడీకి పంపాలన్నారు. ఏదైనా సమాచారం కొరకు 7981391575 ఫోన్ నంబరును సంప్రదించాలన్నారు.

## టెట్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చెయ్యాలి

### - యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు లింగమయ్య డిమాండ్



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 18 ప్రభాతవార్త

2010కి ముందు నియామకం పొందిన ప్రతి ఉపాధ్యాయుడు టెట్ కచ్చితంగా పాస్ కావాల్సిందేనని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ ఉపాధ్యా యుల పక్షాన వేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం నందు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అలెగ్జాండర్‌కు నిరసన అనంతరం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వయానా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రివ్యూ పిటిషన్ దాఖలు చేస్తామని చెప్పిన ఆచరణలో అమలు కాలేదని ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తికి ఆవేదనకు గురయ్యారని తెలిపారు. అదీకాక ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ మంత్రి కేంద్ర విద్యాశాఖ మంత్రిని కలిసిన సందర్భంలోనైనా ఈ అంశాలు ప్రస్తావించకపోవడం ఉపాధ్యాయులను అవమానపరిచినట్లుగా భావించాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, జిల్లా కార్యదర్శులు సుబ్బరాయుడు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, సీనియర్ నాయకులు నాగేంద్ర, హెంగ్డీ చంద్రశేఖర్, రామాంజనేయులు, మంజునాథ్, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తాయ్..!

### - మచ్చా రామలింగారెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏపీ ఒలంపిక్ అసోసియేషన్
### - జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను ప్రారంభించిన.. మచ్చా రామలింగారెడ్డి..



టైక్వాడ్ పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం, డిసెంబర్ 18 ప్రభాతవార్తబ్యూరో

నేటి యువత క్రీడలు తప్పకుండా ఆడాలని క్రీడల్లో ఆడడం ద్వారా ఆరోగ్యంగా ఉండడంతోపాటు బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తాయని మచ్చా రామలింగారెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ అసోసి యేషన్ అన్నారు. అనంతపురం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో గురువారం జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతి థిగా మచ్చా రామలింగారెడ్డి, ఉపాధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ అసోసియేషన్ పాల్గొన్నారు. సభ అధ్యక్షుడిగా గురుస్వామి కార్యదర్శి జిల్లా తైక్వాండ్ అసోసియేషన్ వ్యవహరించారు. తైక్వాండో జిల్లా స్థాయి పోటీలను మచ్చా రామలింగారెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ.. చిన్నారులు క్రీడల్లో పాల్గొనడం వలన వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తాయని నేటి సమాజంలో క్రీడలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని, ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో శిక్షణ మొదలు పెట్టాలి అన్నారు. తైక్వాండో క్రీడకు ప్రత్యేకత ఉందని, ఇది ఆత్మ రక్షణతోపాటు క్రీడా రిజర్వేషన్‌కు కూడా ఉపయోగపడుతుంది అన్నారు. తైక్వాండోలో ప్రతిభ కనబరిస్తే ఉన్నత చదువులతోపాటు ఉద్యోగాల్లో రిజర్వేషన్ సంపాదించవచ్చు అన్నారు. క్రీడాకారులు జిల్లా స్థా యిలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయిలో రాణించి అనంతపురం జిల్లా ఖ్యాతిని పెంచాలని సూచించారు. ఆధు నిక కాలంలో పిల్లలను క్రీడల వైపు ప్రోత్స హిస్తున్న తల్లిదండ్రు దులను, జిల్లా తైక్వాండో అసోసి యేషన్ సభ్యులను అభినంది ంచారు. డిఎస్డిఓ మంజుల మాట్లాడుతూ.. తైక్వాండో సాధ నకు ఇది సరైన వయస్సు అని, ఈ వయస్సు నుంచి క్రమం తప్పక సాధన చేస్తే భవిష్యత్తుకు బంగారు బాట లు వేసుకోవచ్చు అన్నారు. చిన్న వయస్సు నుంచే ప్రోత్సా హాన్ని అందిస్తున్న విద్యార్థుల తల్లి దండ్రులను అభినందించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గురుస్వామి మాట్లాడుతూ ఈ పోటీలకు సబ్ జూనియర్, క్యాడెట్ విభాగాల నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొనడం ఈ పోటీల్లో మొదటి స్థానాలు సాధించిన సబ్ జూనియర్ క్రీడాకారులు జనవరిలో జరుగు 39వ అంతర్ జిల్లాల తైక్వాండో పోటీల్లో పాల్గొంటా రన్నారు. ఈ పోటీలు విజయవంతం అయ్యేందుకు కృషి చేసిన సీనియర్ శిక్షకులు కేశవయ్య, వెంకటేశులు, మ నీంద్ర, కృష్ణ బాబులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అభినందించింది.

# బాల్యవివాహాలు అనర్థదాయకం

### - ప్రతిఒక్కరూ చట్టాలను అవగతం చేసుకోవాలి - డిఎల్ఎస్ఏ సెక్రెటరీ రాజశేఖర్, గుత్తి సీనియర్ సివిల్ జడ్జీ కాశీవిశ్వనాథ ఆచారి - కేజీబీవీ పాఠశాలలో న్యాయ అవగాహణ శిభిరం



.చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం.



.హాజరైన విద్యార్థినీలు.

పామిడి, డిసెంబర్ 18 ప్రభాతవార్త

బాల్యవివాహాలు అనర్థదాయకం అని వాటి కారణంగా అనేక నష్టాలు సంభవిస్తాయని డిఎల్ఎస్ఏ సెక్రెటరీ రాజశేఖర్, గుత్తి సీనియర్ సివిల్ జడ్జి కాశీవిశ్వ నాథ ఆచారి పేర్కొన్నారు. పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో ఎస్ఓ సౌభాగ్యలక్ష్మి అధ్యక్షతన రాష్ట్ర లీగ్ సర్వీసెస్ అథారిటీ వారి ఆదేశాల మేరకు ఆరవ అదనపు జాల్లా న్యాయమూర్తి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మెన్ సదుబాబు ఆధ్వర్యంలో గురువారం 100 రోజుల బాల్య వివాహాల నివారణలో బాగంగా న్యాయ అవగాహణ శిభిరాన్ని నిర్వహించారు. ఈసం దర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చట్టాలను అవగతం చేసుకోవాలని తెలియజేస్తూ అందుబాటులో న్యాయం న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యం అన్నారు. బాల్య వివాహాలు చట్ట విరుద్ధం అంటూ వాటిని అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తును తీర్చిది దట్టంలో ఉపాధ్యాయులు కీలక పాత్రను పోషిస్తున్నారని ఈక్రమంలో విద్యా ర్థులంతా క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యశిస్తూ ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఆకాంక్షించారు. బాల్య వివాహ నిషేదిత చట్టం ప్రకాం 18 ఏళ్ళలోపు ఉన్నటువంటి అమ్మాయికి 21 ఏళ్ళలోపు ఉన్న అబ్బాయికి వివా హం చేస్తే ఎంతటివారైనప్పటికీ చట్టరీత్య చర్యలు తప్పవన్నారు. బాలలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు జరుగుచున్నట్లు ఎవరికైనా తెలిసినచో చైల్డ్‌లైన్ 1098, డయల్ 100 పోలీసులకు సమాచారాన్ని తెలియజేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ గంగాధర్, శ్రీనివాసులు, కోర్టు సిబ్బంది సాధిక్, పారా లీగల్ వాలంటరీ ఇస్మాయిల్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

# కరవు ప్రాంతానికి నిధులు.. నీళ్లు.. ఇవ్వండి

### ఏపీ ఎన్ఐడిసి సమావేశంలో గళ మెత్తిన బోర్డ్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్



సమావేశంలో పాల్గొన్న బోర్డ్ డైరక్టర్ పత్తి చంద్రశేఖర్

అనంతపురం వైద్యం డిశంబర్ 18ప్రభాతవార్త

కరవు జిల్లాలైన అనంతపురం సత్యసాయి జిల్లాలకు నిధులు,నీళ్ల అధికంగా కేటాయించాలని రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్ కోరారు. గురువారం విజయవాడ జల సౌద ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ల లీలా కృష్ణ అధ్యక్షతన మూడవ బోర్డు సమావేశం నిర్వహిం చారు. సమావేశంలో ప్రవేశపెట్టిన అజెండాలపై బోర్డు సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్ సమా వేశంలో పలు అంశాల గురించి గళం విప్పారు. కరవు ప్రాంతం అయిన ందు న ఉమ్మడి అనంతపురం జిల్లాలకు నిధులు, నీళ్ల అధికంగా కేటాయించే విధంగా కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎంతో సారవం తమైన నేల ఉన్న ఈ ప్రాంతాలకు సకాలంలో నీరు అందించగలిగితే రైతు లు అత్యద్భుత దిగుబడి సాధిం చడంతోపాటు దేశంలోనే రాష్ట్రా నికి మంచి పేరు తీసుకొ స్తారన్నారు. అలాగే ఇరిగేషన్ కు సంబంధించిన కార్యాలయాల్లో సిబ్బంది కొరతను కూడా భర్తీ చేయాలని పత్తి చంద్రశేఖర్ సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ తిరుమలరావు, బోర్డ్ సభ్యులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, వి.గజేంద్ర, అంకెమ్ ఇందిరా ప్రియదర్శిని, పైడిపాముల కృష్ణ కుమారి, గోళ్ళ లోకేష్, ముద్ద వరం సంజమ్మ, కోటగిరి నారాయణరావు, మాదక పార్వ తి, పట్టి చంద్రశేఖర్, అంగార రామ మోహన్, క్రరి సత్య గౌరీ, పెమ్మసాని నాగేశ్వరరావు, పల్లవల్ వెంకట సుధాకర రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# డాక్టర్ రామసుబ్బయ్య పార్థివ దేహానికి పలువురి నివాళులు



డాక్టర్ రామసుబ్బయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

అనంతపురం, డిసెంబర్ 18 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం రామ్‌నగర్‌లో వారి స్వగృహంలో అనారోగ్య కారణాలతో డాక్టర్ రామసుబ్బయ్య పరమపదించిన సందర్భంగా వారి ఆత్మకు శాంతి చేకూరాలని అనంతపురం జిల్లా మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు కెప్టెన్ షేకన్న అధ్యక్షతన, డాక్టర్ రామసుబ్బయ్య కుమారుడు లెఫ్టినెంట్ జనరల్ వై.వి.కె మోహన్‌తో కలిసి వారి నివాసములో పుష్పగుచ్ఛంతో సంఘ సభ్యులు తోపాటు నివాళులర్పించారు. డాక్టర్ రామసుబ్బయ్య కుమారులు లెఫ్టినెంట్ జనరల్ వైవికె మోహన్, మాజీ సైనికుల సంఘం కోసం ఎంతో సహాయం చేశారు. ముఖ్యంగా ఈసీహెచ్ఎస్ పాలి క్లినిక్ స్థలం కొనడానికి ఫండ్స్ రావడానికి, ఈసీహెచ్ఎస్ హాస్పిటల్ శాంక్షన్ చేయించడానికి వారు ఢిల్లీలో సర్వీస్‌లో ఉన్నప్పుడు మన ఉమ్మడి జిల్లా మాజీ సైనికులకు ఎంతో సహాయం చేశారు. డాక్టర్ రామసుబ్బయ్య పరమపదించడం మన అందరికీ ఎంతో దుఃఖ దాయకము. డాక్టర్ రామసుబ్బయ్య సేవలను ఎప్ప టికీ మరువ లేము. ఈ కార్యక్ర మంలో ట్రెజరర్ తిమ్మా రెడ్డి, బి.రవికుమార్, వెంకట సుబ్బ రాజు, టికె కృష్ణ, అబ్దుల్ ఖాదర్, బిఎ ఉసేన్, వై ప్రసాద్, పి.సిద్ధన్న, ఎం.బషీర్ అహమద్, బండి వెంకటరమణ, బి.పెంచల య్య, గొల్ల ఈశ్వరయ్య, వెంకట నాయుడు, పి.బాబా, ఇస్మాయిల్ షఫీ, సాదిక్ భాషా, నంజుండయ్య తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో సత్తా చాటిన కరుట్లపల్లి జడ్పీ హై స్కూల్ విద్యార్థులు

కూడేరు, డిసెంబర్ 18 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు సాయి కృష్ణ, గౌస్ మహమ్మద్ పాల్గొన్నారు. విద్యా ర్థులలో సైన్స్ పట్ల ఆసక్తి, ప్రయోగాత్మక పరిశీలనలో భాగంగా వాటిని పెంపొందించడంలో ఇలాంటి సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతో ఉపయోగపడతాయని మండల విద్యాశాఖ అధికారి మహమ్మద్ గౌస్ పేర్కొన్నారు. అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైన్స్, ప్రయోగశాలను పట్ల అనేక నిధులు ఖర్చు చేస్తూ విద్యార్థులలో దాగి ఉన్న శాస్త్రవేత్తలను వెలికి తీయడంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. మొదటి స్థానంలో ఎకో సాన్ టాయి లెట్ కరుట్లపల్లి పాఠశాల విద్యార్థులు, రెండవ స్థానంలో వేస్ట్ మేనేజ్మెంట్ కేజీబీవీ కూడేరు విద్యార్థులు, మూడవ స్థానంలో సస్టైనబుల్ అగ్రికల్చర్ జల్లిపల్లి పాఠశాల విద్యార్థులు, ఇండివిజువల్ కేటగిరీలో డ్రిప్ ఇరిగేషన్‌లో కూడేరు విద్యార్థులు గెలుపొందారు. వీరంతా 20వ తేదీన జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఇందులో ప్రత్యేకంగా మొదటి స్థానం సంపాదించిన కరుట్లపల్లి విద్యార్థినులైన ప్రణిత, భవానిలను, ప్రధానోపాధ్యాయులైన ఆంజనేయులు, సైన్స్ ఉపాధ్యాయురాలు నాగరత్నను ఎమ్ఈఓలు అభినందించారు.

## ఇంటర్మీడియట్ విద్య, పరీక్షల నిర్వహణలో నూతన సంస్కరణల ఆవశ్యకతపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 18 ప్రభాతవార్త

ఇంటర్మీడియట్ విద్య, పరీక్షల నిర్వహణలో నూతన సంస్కర్ణల ఆవశ్యకతపై అవగాహన సదస్సును గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)లో నిర్వహించారు. డి.వి.ఈ.ఓ.ఆర్.ఐ.ఓ. ఎం.వెంకటరమణ నా యక్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అవగాహన కర్తగా వి.రమేష్, ఓఎస్‌డి, ఇంటర్మీడియట్ విద్య వ్యవహరించారు. ముఖ్య అతిదిగా డా.సి.సురేశ్ బాబు, ప్రాంతీయ సంచలకులు, ఇంటర్మీడియట్ విద్యా, కడప వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వున్న అన్ని కళాశా లల ప్రిన్సిపాళ్ళు, లెక్చరర్స్, కార్యాలయ సిబ్బంది హాజరయ్యారు. వీరితో పాటు ప్రిన్సిపాల్ ఎ.రఘునాథరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో డా.వి.రమేష్, ఓఎస్‌డి పలు విషయాలపై సభికులకు అవగాహన కల్పించారు. నూతన విద్యావిధానం అనుసరించి ఇంటర్ విద్యలో చేపట్టిన సంస్కరణలు, ఐచ్ఛిక సబ్జెక్ట్స్, అదనపు సబ్జెక్ట్ ్స ప్రశ్నపత్రాల రూపకల్పన, సిబిఎస్ఈ నమూనా పరీక్ష నిర్వహణ విధానము, సిలబస్ నందలి మార్పులు, నీట్, జెఈఈ పోటీపరీక్షలకు అవసర మయ్యే మార్పులు, ప్రశ్నాపత్రాల కోడ్స్, విభిన్న సమాధాన పత్రాలను ఉపయోగిం చడం (ముఖ్యంగా 24 పేజీలు మరి యు 32 పేజీలు), పరీక్షల నిర్వహణ, సమాధాన పత్రాల ప్యాకింగ్ ముఖ్యంగా బయాలజీ పేపర్‌కు సంబందించి విషయా లు, పాత ప్రశ్నాపత్రాలు, కొత్త ప్రశ్నా పత్రాలు పంపిణీ విద్యార్థుల విషయంలో అంశాల పట్ల సంపూర్ణంగా అవగాహనను కల్పి ంచారు. అవగాహన అనం తరం పలువురు సంధించిన ప్రశ్నలకు, సందేహాలకు పూర్తి స్థాయిలో ఓఎస్‌డి ప్రతిస్ప ందించి సందేహా లన్నింటిని నివృత్తి చేశారు. ఈ కార్యక్రమం పట్ల హాజరైన సభికులందరూ ఆనందం వ్యక్తం చేశారు.

## సియం సార్‌కి కృతజ్ఞతలు

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 18 ప్రభాతవార్త

ఉద్యోగ, ఉపాధ్యాయ, సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చొరవ ఉద్యోగులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఏ. పి.యస్. సి.యస్.టి. ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా కార్య దర్శి రామంజినమ్మ, శాంతకుమారి, అనితా, సరస్వతి, కవిత, సునీతా, అ రుణేశ్వరి, విజయ, ఈశ్వరి, తదితరులు హర్షం వ్యక్తం చేశారు. పిల్లల సం రక్షణ సెలవులు ఎప్పుడైనా వాడుకొనే వెసులు బాటు కల్పించడంతో నేకమంది మహిళా ఉద్యోగులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు. గతం లో మహిళలకు సెలవులు ఉన్నప్పటికీ అమలుకాలేదని వారు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి కృతజ్ఞతలు తెలియజ ేశారు. ఈ కార్యక్రమంలో రామలక్ష్మి, పద్మ, వరలక్ష్మిదేవి, రాజేశ్వరి, శశికళ, సాయిప్రియ, ప్రమీల, నల్లమ్మ, ఉషా, కమలాబాయి తదితరులు పాల్గొన్నారు.

## యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై అవగాహన



వార్డు సచివాలయాల సెక్రటరీలకు యూనిఫైడ్ ఫ్యామిలి సర్వేపై అవగాహణ కల్పిస్తున్న మాస్టర్ ట్రైనరు

అనంతపురం, డిసెంబరు18 ప్రభాతవార్త

యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై అవగాహన కార్యక్రమాన్ని నగరపాల క సంస్థ కౌన్సిల్ సమావేశపు హాలులో గురువారం వార్డు సచివాల యాల ఉద్యోగులతో నిర్వహించారు. జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు రాష్ట్ర సెక్రటరియేట్ అమరావతిలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లతో శుక్ర వారం నుంచి ఇంటింటి సర్వే చేపట్టి యుఎఫ్ఎస్ మొబైల్ యాప్‌లో పొందపరిచి లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు నేరుగా అందించడానికి చర్యలు చేపడతారు. అలాగే ఫ్యామిలీ బెనిఫిట్ కార్డులు జారీ చేయడానికి ఈ సర్వే సులభతరమౌతుందని మాస్టరు ట్రైనర్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు గిరిప్రసాద్, పి.బాలరాజు, ఎం.రాఘవేంద్రరావు, ఏ.శిల్పారాణి, ఏ.శ్రావంతి, జె.శివశంకర్,ఎం.కె.వరప్రసాద్, టి. కళావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో వందశాతం విజయవంతం చేయాలి

### -డిప్యూటి కమిషనర్ డాక్టర్ పావని



పల్స్‌పోలియో నిర్వహణపై అవ గహన సదస్సులో మాట్లాడు తున్న డిప్యూటి కమిషనర్ పావని తదితరులు

అనంతపురం, డిసెంబరు18 ప్రభాతవార్త

ఈ నెల 21న చేపట్టే పల్స్‌పో లి యో కార్యక్రమం వందశాతం విజ య వంతం చేయాలని నగరపా లక సంస్థ డిప్యూటి కమిషనర్, ఇన్‌చార్జ్ ఆరోగ్య అధికారి డాక్టర్ డి.పావని అర్బన్ హెల్త్ సెక్రటరీలు, ఆశావర్క ర్లకు పిలుపుని చ్చింది. స్థానిక కౌన్సిల్ సమావేశపు హాలులో గురు వారం పల్స్‌పోలియో నిర్వహ ణపై అవగాహన సదస్సును నిర్వహి ంచగా జిల్లా ఇము మ్యనైజేషన్ అధికారి శశిభూషన్, అర్బన్ నోడల్ అధికారి విష్ణుమూర్తి, ఏఎస్ఓ ప్రవీణ్ కుమార్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నా రు. ఈ సందర్భంగా అధికా రులు మాట్లాడుతూ నగర పరిధిలో 34,310 మంది చిన్నారులు వున్నట్లు అంచనా వుందని, వీరందరికీ 120 బూత్‌లు , 8 ట్రాన్సిట్ పాయి ంట్‌లు, 12 మంది సూపర్ వైజర్ల పర్యవేక్షణలో వందశా తం పోలియో చుక్కలు పిల్లలకు వేయడానికి ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నట్లు వెల్లండించారు.

## సినీ డైరెక్టర్ మృతికి నివాళులు అరర్పించిన సుగమంచి సురేష్‌బాబు



నివాళులు అర్పిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 18 ప్రభాతవార్త

సినీ దర్శకులు కిరణ్ కుమార్ మృతి చెందడంతో ఉపాధ్యాయులు సుగమంచి సురేష్‌బాబు నేడు (గురువారం) ఉరవ కొండ మండలం ఇంద్రావతి గ్రామానికి చేరుకుని అతని పార్థివ దేహానికి నివా ళులు అర్పించారు. ఈ సందర్భ ంగా సుగమంచి సురేష్‌బాబు మాట్లాడు తూ.. డైరెక్టర్ కిరణ్‌కుమార్ నాగార్జున హీరోగా నటించిన కేడీ చిత్రానికి దర్శకత్వం వహించి, అలాగే నాగార్జున నటించిన కింగ్ సినిమాకు అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేసినట్లు తెలియజేశారు. నాతోపాటు హీరో నాని, అర్జున్ రెడ్డి సినిమా డైరెక్టర్ సందీప్, సినీ హీరో, యాంకర్ శశి కుమార్, అలాగే అసిస్టెంట్ డైరెక్టర్ మహేందర్ విచ్చేసి ఆయన భౌతికాయానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా దర్శకులు కిరణ్ కుమార్ ఆత్మకు శాంతి కలగాలని ఆ దేవుని ప్రార్థించినట్లు సుగుమంచి సురేష్ బాబు పేర్కొన్నారు.

## కౌశల్ క్విజ్-2025

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 18 ప్రభాతవార్త

భారతీయ విజ్ఞాన మండలి, పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా ఆన్ లైన్ విధానంలో నిర్వహించిన కౌశల్ క్విజ్-2025లో అనంతపురము జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి అర్హత పొందిన విద్యార్థులకు గురువారం బహుమతి ప్రదానం చేశారు. అనంతపురము జిల్లా విద్యాశాఖాధికారి యం.ప్రసాద్ బాబు, డిసిబిఈ కార్యదర్శి గంధమనేని శ్రీనివాసులు నగదు బహుమతితో సర్టిఫికెట్, మెమెంటోను బహూకరిస్తూ రాష్ట్ర స్థాయిలో కూడా మంచి ప్రతిభ కనపరచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర స్థాయికి అర్హత పొందిన విద్యార్థులు ఈ నెల 27న తిరుపతిలోని సంస్కృత విశ్వ విద్యాలయంలో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి కౌశల్ క్విజ్‌లో పాల్గొంటారని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కౌశల్ జిల్లా సమన్వయకర్త ఆనందభాస్కర రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎఫ్ఎల్ఎన్ మెటీరియల్ సప్లై

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 18 ప్రభాతవార్త

జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలో 1, 2 తరగతులకు సంబంధించిన ఎఫ్ఎల్ఎన్ ప్రింటెడ్ మెటీరియల్‌ను గురువారం నుండి మండల కేంద్రాలకు పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు డిఇఒ తెలియజేశారు. మండల విద్యాశా ఖా ధికారులు వీటిని శనివారము జరుగు క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలలోపు మండల ప్రాథమిక పాఠశాలకు పంపిణీ చేయాలని సూచించారు.

## బండి దైవయత్నంను పరామర్శించిన టిడిపి నేతలు

శింగనమల, డిసెంబర్ 18 ప్రభాతవార్త

మండల పరిధిలోని గురుగుంట్ల గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు బండి దైవయత్నంకు రోడ్డు ప్రమాదంలో చేయి విరగడంతో జిల్లా కేంద్రంలో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని టిడిపి మండల కన్వీనర్ గోరంట్ల మారుతినాయుడు, సింగిల్ విండో చైర్మన్ గుర్రం లక్ష్మినారాయణ, మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, తెలుగు యువత నాయకులు వడ్డే సుంకన్న తదితరులు బండి దైవయత్నంను పరామర్శించి ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు.

# ప్రభుత్వ స్థలం కనపడిందా...! ఆ స్థలం గోవిందా...గోవింద...!

( మొదటి పేజీ తరువాయి ) రిజర్వుస్థలాన్ని కేటాయించారు. అయితే కొందరు అక్రమార్కులు మున్సిపల్లంలో అక్రమ కట్టడాలను నిర్మిస్తున్నారు. దీంతో అభివృద్ధికి ఆటంకం కల్గుతుందని పలువురు కాలనీ వాసులు పేర్కొంటున్నారు. ఇరిగేషన్ స్థలం అన్యాక్రాంతానికి యత్నం: కుణుతూరు పొలం సర్వేనెంబరు 426లో దాదాపు 3ఎకరాల దాకా ఉంది. ఇరిగేషన్ స్థలం పక్కనే గొల్లపల్లివంక ద్వారా గొట్లూరు చెరువులోకి నీరు వెళ్తుంది. పక్కనే ఉన్న ఇరిగేషన్ స్థలాన్ని కబ్జా చేయడానికి రాళ్లు తోలారు. ఇరిగేషన్ కు సంబంధించి స్థలాన్ని కేటాయించారు.ఆస్థలం ఏదైనా అభివృద్ధి కార్యక్రమాల కోసం ఉంటుందని అధికారులుబావించారు. అయితే ఆ స్థలాన్ని కాజేయాలనికొందరు కన్నేశారు. ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని జగనన్న కాలనీ వాసులు కోరుతున్నారు. ఇది వరకే నోటీసులు ఇచ్చాం: గురుప్రసాద్, ఏఈ, ఇరిగేషన్: కుణుతూరు పొలం సర్వేనెంబరు 426లో కొందరు కబ్జా చేయాలని రాళ్లు తోలారు. దీంతో ఇరిగేషన్ స్థలంలో రాళ్లు తోలి ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నట్లు టీడీపీ నాయకులు గ్రీవెన్స్ లో పిర్యాదుచేశారు. దీంతో అక్కడికి వెళ్లి సదరు వ్యక్తులకు పోన్ చేసి ఇరిగేషన్ స్థలంలో తోలినరాళ్లను తొలగించాలని చెప్పి నోటీసులు అందజేశామని తెలిపారు.మరోసారి చెప్పి అన్యాక్రాంతానికి పాల్పడేవారిపై చర్యలు తీసుకుంటాం. ..మున్సిపల్ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం: అలివేళమ్మ, టౌన్ ప్లానింగ్ అధికారి,ధర్మవరం: కుణుతూరు పొలంలో ఏర్పాటుచేసిన జగనన్న లేఔట్లో మున్సిపల్ రిజర్వుస్థలాన్ని కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఆ కట్టడాలు చేపట్టి అన్యాక్రాంతానికి గురిచేస్తున్నట్టు పిర్యాదులు అందాయి. దీంతో ఇటీవల అక్కడికి వెళ్లి అక్రమ కట్టడాలను తొలగించుకోవాలని సంబంధిత అక్రమణదారులకు చెప్పివచ్చాం. వారు తొలగించుకోకపోతే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ అధికారిణి తెలిపారు .

04ATP18_04ATP18.qxd 18-12-2025 PM 10:51 Page 1



## పారిశుద్ధ్య పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని బహిష్కరించిన ఎమ్మెల్యే సురేంద్రబాబు

### - అధికారుల నిర్లక్ష్య పనితీరుపై ఆగ్రహం - అన్ని పంచాయతీలకు పంపిణీ చేసేటప్పుడు మళ్ళీ వస్తా

కళ్యాణదుర్గం, డిసెంబర్ 18 ప్రభాతవార్త :
కళ్యాణదుర్గం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీలకు పారిశుద్ధ్య పరికరాలు చెత్తకుండీలు, చెత్త సేకరణ ట్రాలీలు పంపిణీ కోసం ఏర్పాటుచేసిన సమావేశాన్ని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అధికారుల నిర్లక్ష్య పనితీరును నిరసిస్తూ సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయిన సంఘటన మండలంలో చర్చనీయాంశం అయింది. కళ్యాణ దుర్గం మండలంలో 14 గ్రామపంచాయతీలు ఉండగా కేవలం 5 గ్రామ పంచాయితీ లకు సంబంధించిన పరికరాలను పంపిణీ కోసం సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎమ్మెల్యే సురేంద్రబాబును మండల పరిషత్ అధికారులు ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామ పంచాయ తీల నుండి ప్రజలు పార్టీ నాయకులు అధికారులు విచ్చేశారు. పారిశుద్ధ్య పరికరాల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే సురేంద్రబాబు కేవలం ఐదు పంచాయతీలకు చాలీచాలని పరికరాలు వచ్చినట్లు తెలుసుకొని అధికా రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రతి పంచాయతీకి పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన పరికరాలు అంది స్తుంటే మన నియోజకవర్గంలో మాత్రం అధికారుల సమన్వయ లోపం, పనితీరు సరిగా లేకపోవడం కారణ ంగా అన్ని పంచాయతీ లకు పారి శుద్ధ్య పరికరాలు రాకపోవడా న్ని నిరసిస్తూ కార్యక్ర మాన్ని బహి ష్కరిస్తున్నానని ప్రకటించి ఎమ్మెల్యే వెళ్లిపోయారు. దీంతో పలు పంచాయతీలకు వచ్చిన పారిశుద్ధ్య పరికరాలు, టబ్బులు, ట్రాలిల పంపి ణీ కార్యక్రమం ఆగిపోయిన పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యేతో పాటు ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చౌలం మల్లికార్జున, మార్కెట్ యార్డు చైర్మన్ గోళ్ళ లక్ష్మీదేవి రమేష్, మున్సిపల్ చైర్మన్ తలారి గౌతమి సోమశేఖర్, ఎంపీపీ మారుతమ్మ, డీడీఓ నాగేశ్వర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని పంచాయతీ లకు పారిశుద్ధ్య పరికరాలు వచ్చిన తరువాత పంపిణీ కార్యక్రమానికి హాజరవుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రజలు, ఆయా గ్రామాల ప్రజాప్రతి నిధులు, అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ వెళ్లి పోయారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

## అశ్రునయనాల మధ్య సినీ దర్శకుడు కిరణ్‌కుమార్ అంత్యక్రియలు

### -ఇంద్రావతికు తరలివచ్చిన డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, నటులు
### -'కేడి' సినిమాకు దర్శకత్వం, త్వరలో విడుదల కానున్న 'కేజేక్యూ' సినిమా



సినీ దర్శకుడు కిరణ్‌కుమార్ (కేకే) భౌతికకాయంవద్ద నివాళులర్పిస్తున్న స్థానికులు



అంత్యక్రియలకు హాజరైన సినీ ప్రముఖులు



సినీ దర్శకుడు కిరణ్‌కుమార్ (ఫైల్‌ఫోటో)

ఉరవకొండ,
డిసెంబరు 18 ప్రభాతవార్త
తెలుగు సినిమా దర్శకుడు కిరణ్‌కు మార్ (కేకే) అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన ఉరవకొండ మండలం లోని ఇంద్రావతి గ్రామంలో గురువా రం బంధు మిత్రులు, తోటి సినీ కళా కారుల అశ్రునయనాల మధ్య జరి గాయి. దర్శకుడు కిరణ్‌కుమార్ బుధ వారం కన్నుమూసిన విషయం తెలి సిందే. ఈ క్రమంలో ఆయన భౌతిక కాయాన్ని స్వగ్రామానికి తీసుకొ చ్చారు. కిరణ్‌కు మార్ తండ్రి డాక్టర్ శ్రీరాములు ఉరవకొండ ప్రాంతంలో అందరికీ సుపరిచి తులు. ఆయనకు ముగ్గురు కుమారులు సంతానంకాగా రెండవ సంతానమైన కిరణ్‌కుమార్ అవివాహితుడని తెలిసింది. కిరణ్‌కుమార్ ప్రముఖ హీరో అక్కినేని నాగార్జున నటించిన 'కేడి' సినిమాకు దర్శకత్వం వహించగా ఆ సిని మా 2010లో విడుదలైంది. నాగార్జున హీరోగా నటించిన 'కింగ్' సినిమాకు సైతం ఆయన అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారని సమాచారం. ప్రస్తుతం ఆయన 'కేజేక్యూ' కింగ్..జాకీ..క్వీన్ సినిమాకు దర్శకత్వం వహించగా సినిమా షూటింగ్ పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధమవుతున్న తరుణంలో ఆయన హఠాన్మరణం టాలీవుడ్‌లో విషాదాన్ని నింపింది. కిరణ్‌కుమార్ పలు టీవీ సీరియల్స్‌కు కూడా దర్శకత్వం వహించి మంచి దర్శకుడని పేరు తెచ్చుకున్నారని సినీ వర్గాలు తెలిపాయి. తోటి కళాకారుడికి కడసారి వీడ్కోలు పలకడానికిగాను సినీ హీరో నాని, అర్జున్‌రెడ్డి సినిమా దర్శకుడు సందీప్, హీరో, యాంకర్ శశికుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ మహేందర్ ఇతర కళాకా రులు ఇంద్రావతికు తరలివచ్చి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళుల ర్పించారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపా ధ్యాయులు సి.రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు ఎస్.సురేష్‌బాబు, వివిధ గ్రామాల ప్రజలు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## జిల్లా ప్రగతిపై సమగ్ర నివేదిక సమర్పించిన జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్

శ్రీ సత్యసాయి జిల్లా, డిసెంబరు 18, ప్రభాతవార్త ప్రతినిధి:
శ్రీ సత్యసాయి జిల్లా సమగ్ర ప్రగతి సాధించేలా ప్రణాళికలను పటిష్టంగా అమలు చేయడానికి జిల్లా యంత్రాంగం సమిష్టిగా కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వివరించారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రెండవ రోజు రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన 5వ జిల్లా కలెక్టర్ల సదస్సులో జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ పాల్గొని జిల్లా ప్రగతిపై సమగ్ర నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా సమీక్షలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాలో అమలు చేస్తున్న కార్యాచరణ కార్యక్రమాలు, ప్రభు త్వం నిర్దేశించిన 10 సూత్రాల అమలు, వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల పురోగతి, ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహం, రైతు ఆదాయం పెంపుదలపై తీసుకుం టున్న చర్యలను ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన కార్యక్రమాలలో భాగంగా జాబ్ మేళాల నిర్వహణ, స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, పరిశ్రమలతో అనుసంధానం ద్వారా ఉపాధి పెంపుపై జరుగుతున్న చర్యలను సమగ్రంగా వివరించారు. అలాగే జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న ముందస్తు చర్యలు గురించి కూడా జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ సమా వేశంలో వివరి ంచారు. జిల్లా సమగ్రాభి వృద్ధి, సుస్థిర పాలన లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా లక్ష్య సాధనకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉప ము ఖ్య మంత్రి, రాష్ట్ర మంత్రు లు, చీఫ్ సెక్రటరీ, ఆయా శాఖల ప్రధాన కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



ఐదవ జిల్లా కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ దృశ్యం

## అంగన్వాడి పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందించండి

### అంగన్వాడిలకు టిడిపి హయాంలోనే 3 సార్లు వేతనాలు పెంచాం
### అంగన్వాడీలకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



అంగన్వాడీ కార్యకర్తలకు స్మార్ట్‌ఫోన్లను పంపిణీ చేస్తున్న దృశ్యం



ఎమ్మెల్యేను సన్మాస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కళ్యాణదుర్గం, డిసెంబర్ 18 ప్రభాతవార్త:
అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని, ఆటపాటలతో పిల్లలో చదువు పట్ల ఆసక్తి పెంచేలా అంగన్వాడీ కార్యకర్తలు టీచర్లు ఐసిడిఎస్ అధికారులు పనిచేయా లని ఎమ్మెల్యే సురేంద్రబాబు పేర్కొన్నారు. గురువారం ప్రజా వేదికలో కళ్యాణదుర్గం, కంబదూరు సెక్టార్ల అంగన్వాడీలకు 5జీ స్మార్ట్ ఫోన్లు, ప్రీ స్కూల్ కిట్లను పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికాభివృద్ధి సాధించాలంటే కూటమి ప్రభుత్వంతో కలసి పనిచేయాలని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీయడానికి బటన్లు నొక్కిన జగనే కారణమన్నారు. నేడు కొత్తగా కోటి సంతకాలు అంటూ వైసీపీ నాయకులు హంగామా చేస్తున్నారని, ఆ కోటి సంతకాల్లో జగన్మోహన్ రెడ్డి సంతకం ఉందో లేదో ముందు చూడాలన్నారు. జగన్ రెడ్డి ఇక ప్యాలెస్ కే పరిమితం అవుతాడని అన్నారు. అరటి ధరలు తగ్గితే దాన్ని కూడా రాజకీ యం చేయడం కోసం రోడ్ల మీదకు వచ్చి హంగామా చేశారని, నేడు ధరలు పెరిగాయాన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు నిత్యం గ్రామాల్లో అందుబాటులో ఉంటారని, కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు అందిస్తున్న పోషకాహారాలు, కిట్ల గురించి వారికి తెలియజేయాలని, అలాగే పోషకా హారాలు పక్కదారి పట్టకుండా చూడాలని తెలిపారు. అనంతరం సీనియర్ నాయకులు మోరెపల్లి చౌలం మల్లికార్జున, మున్సిపల్ చైర్మన్ తలారి గౌతమి సోమశేఖర్, మార్కెట్ యార్డు చైర్మన్ గోళ్ళ లక్ష్మీదేవి రమేష్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కర్లకుంట రామాంజనేయులు, మాజీ కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ డీకే రామాంజనేయులు, సీడీపీఓలు లక్ష్మీప్రసన్న, పద్మావతి, మున్సిపల్ కమీష నర్ వంశీ కృష్ణ భార్గవ్ పాల్గొని పంపిణీ చేశారు. అనంతరం ఐ సి డి ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సురేంద్ర బాబుకు అంగన్వాడీలు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం

### రేమండ్స్ జె.కె. కంపెనీ ప్రతినిధులతో సమావేశమైన అధికారులు

పుట్టపర్తి(కలెక్టరేట్), డిసెంబరు 18, ప్రభాతవార్త
శ్రీ సత్యసాయి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సా హకాలు అందిస్తుందని రేమండ్స్ గ్రూప్‌కు చెందిన జె.కె. మైని కంపెనీ ప్రతినిధులతో జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణలు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశాల మేరకు గురువారం పుట్టపర్తిలోని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా గుడిపల్లి పారిశ్రామిక వాడ, టేకులోడు పారిశ్రామిక వాడలలో ప్రెసిషన్ ఇంజనీరింగ్, గ్లోబల్ ఏరోస్పేస్ రంగాలలో ఏర్పాటు చేయబోయే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, అలాగే నైపుణ్యం కలిగిన యువతకు కల్పించబోయే ఉద్యోగ అవకాశాలపై కంపెనీ ప్రతినిధులతో విస్తృతంగా చర్చించారు.
సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పరిశ్రమల స్థాపనకు అవసరమైన వివిధ రకాల అనుమతులు, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, అలాగే జిల్లాలోని ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుకున్న యువతకు కల్పించబోయే ఉపాధి అవకాశాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. జె.కె. మైని కంపెనీ ప్రతినిధులు 2027 జనవరి నాటికి తొలి దశలో ఉత్పత్తి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ఈ పరిశ్రమల ద్వారా జిల్లాలో స్థానిక యువ తకు పెద్ద ఎత్తున ఉద్యోగా వకాశా లు కల్పించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ చీఫ్ హ్యూ మన్ రిసోర్స్ ఆఫీసర్ ప్రియా మనో జ్, చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ రాఘ వేంద్ర, స్కిల్ డెవలప్‌మెంట్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తేజ్ కుమార్ పాల్గొన్నారు.



జెకె మైని కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న అధికారులు

## కువైట్‌లో ఆలూరు సాంబశివారెడ్డికి ఘన స్వాగతం

శింగనమల, డిసెంబర్ 18 ప్రభాతవార్త
కువైట్‌కు చేరుకున్న వైఎస్ఆర్‌సిపి రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డికి విమానాశ్రయంలో వైఎస్ఆర్‌సిపి ఎన్ఆర్ఐ నేతలు పూల బొకేలు అందించి ఘన స్వాగతం పలికారు. ఈ నెల 21వ తేదిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన సందర్భంగా ప్రవాస నాయకులతో కలిసి జన్మదిన కార్యక్రమ వేడుకల్లో ఆయన పాల్గొననున్నట్లు ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు.



ఆలూరు సాంబశివారెడ్డికి స్వాగతం పలుకుతున్న దృశ్యం



వైఎస్ఆర్‌సిపి ఎన్ఆర్ఐ బృందంతో ఆలూరు సాంబశివారెడ్డి

## శింగనమల క్రాస్ వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేయండి

### - కేంద్ర మంత్రి నితిన్ గడ్కారిని కోరిన ఎమ్మెల్యే, ఎంపి

శింగనమల, డిసెంబర్ 18 ప్రభాతవార్త
మండల కేంద్రంలోని శింగనమల క్రాస్ వద్ద జాతీయ రహదారి 544డి జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ జయరామ్ గడ్కారికి శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, అనంతపురం ఎంపి అంబికా లక్ష్మినారా యణలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ.. శింగనమల క్రాస్ వద్ద అండర్ పాస్ లేకపోవడం వల్ల స్థానికులు, రైతులు వ్యాపారులు ప్రతిరోజు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోజురోజుకు ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని కేంద్ర మంత్రికి ఆమె వివరించారు. అండర్‌పాస్ ఏర్పాటు చేస్తే పరిసర గ్రామాలు వ్యవసాయ భూములు మార్కెట్‌లు విద్య, వైద్య అవసరాలకు ప్రజలు సురక్షితంగా, సులబంగా రాకపోకలు సాగించేందుకు అవకాశం ఉంటుం దన్నారు. తక్షణమే ఎన్‌హెచ్ ఎఐ అధికారు లకు తగిన ఆదేశాలు జారీ చేసి అండర్ పాస్ ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ వినతిపై స్పందించిన కేంద్ర మంత్రి సమస్య ప్రాధాన్యతను గుర్తించి సానుకూలంగా స్పందిస్తూ ఎన్‌హెచ్ఎఐ అధికారులతో పరిశీలన జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



కేంద్ర మంత్రి నితిన్ గడ్కారికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎంపి

## ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఐ ధర్నా

అనంతపురం కలెక్టరేట్ డిసెంబర్ 18 ప్రభాతవా ప్రభుత్వవైద్య కళాశాలలను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్షిప్ విధానంలో నిర్వహించాలన్న చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గురువారం అనంతపురం జిల్లా సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముందు భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి అధ్యక్షత వహించగా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి. జగదీష్ మాట్లాడుతూ పీపీపీ విధానం అమలైతే ప్రభుత్వ ఆసుపత్రులు కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లి ఉచిత వైద్య సేవలు క్రమంగా కనుమరుగవుతాయని హెచ్చరించారు.
డిపాజిట్‌లు, భారీ ఖర్చుల కారణంగా పేదలు, బడుగు వర్గాలు వైద్య చికిత్సకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన వైద్య కళాశాలలను ప్రైవేటు భాగస్వామ్యానికి అప్పగించడం వల్ల ప్రభుత్వ భూములు, భవనాలు, మౌలిక సదుపాయాలు దీర్ఘకాలం పాటు కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. యాజమాన్య కోటాలో భారీ ఫీజులు విధించడం ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని విమర్శించారు. ప్రభుత్వ వైద్య, విద్యకు శాపంగా మారిన జీఓ నంబర్లు 107, 108, 590లను తక్షణం రద్దు చేయాలని సీపీఐ జగదీష్ డిమాండు చేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాసంఘాలతో కలిసి ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి. జాఫర్ మాట్లాడుతూ, ఎన్నికల ముందు ప్రభుత్వ రంగంలోనే మెడికల్ కళాశాలలు ఉంటాయని ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించి వేల కోట్ల విలువైన 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటు శక్తులకు అప్పగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి ,సహాయ కార్యదర్శులు చిరుతల మల్లికా ర్జున, జె.రాజారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్య దర్శి వర్గ సభ్యులు జి. గోపాల్, ఎన్. శ్రీరాములు, తలారి నారాయణస్వామి, ఎ.పద్మావతి, జిల్లా కార్యవర్గ సభ్యులు బి. రమణయ్య, జి. సంతోష్ కుమార్, శ్రీశైలం రాజేష్ గౌడ్, మేకల రమేష్, ఎం. నాగార్జున, ఈ.కుళ్లాయిస్వామి, పెద్దయ్య,జి.చి రంజీ వి,తాడిపత్రి సిపిఐ పట్టన కార్యదర్శి జి.చిరంజీవి, కళ్యాణదుర్గం పట్టన కార్యదర్శి బి.ఆంజనేయులు,నగర సహాయ కార్యదర్శి వి.కృష్ణుడు, అనంతపురం రూరల్ మండల కార్యదర్శి నరేష్,బికెఎస్ మండల కార్యదర్శి బండి రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు హనుమంతు రాయుడు, ఏఐ ఎస్ఎఫ్ నాయకులు ఆంజనేయులు, నరసింహ, వెంకట్, నాయక్, మంజు, వంశీ, చందు, నాని, అఫన్, సన్నీ, సిపిఐ నాయకులు ప్రజాసం ఘాల నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొ న్నారు. సీపీఐ జిల్లా, మండల, పట్టణ నాయకులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సిపిఐ నాయకుల ధర్నా

## విద్యార్థులకు పారిశ్రామిక అవగాహన పెంచే దిశగా చర్యలు

### - జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు

అనంతపురం సిటీ, డిసెంబర్ 18 ప్రభాతవార్త
పారిశ్రామిక అవగాహన పెంచేలా అధ్యాపకులకు, విద్యార్థులకు పరిశోధన అవకాశాలు సాంకేతిక పరిజ్ఞానం అవసరం శిక్షణ కార్యక్రమాలు పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు పేర్కొన్నారు. బెంగుళూరుకు చెందిన ఎంఎస్ఎక్సెల్‌ఆర్ఎడ్‌టెక్ సంస్థతో గురువారం జెఎన్‌టియుఏ ఎంఓయును కుదుర్చుకుంది.
జెఎన్‌టియుఏలో విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ ఎంప్లాయిబులిటీ పెంచే దిశగా ఆ సంస్థ పనిచేయ నుంది. ఈ సందర్భంగా జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. ఎంఓయు ద్వారా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు సాంకేతికతపై శిక్షణను అందించడం జరుగుతుందన్నారు. రిజిస్ట్రార్ కృష్ణయ్య మాట్లాడుతూ.. ఎంఓయు ద్వారా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలతో అధునాతన టెక్నాలజీలపైన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుం దన్నా రు. విద్యార్థుల భవిష్య త్తు ను మెరుగు పర్చడంలో ఈ ఎంఓయు కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విసి ఓఎస్‌డి దేవన్న, ఫ్యూచర్ స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ శోభ బిందు, బిఎపి సత్యనారాయణ, ఎంఎస్ఎక్సె ల్‌ఆర్ఎడ్ టెక్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ సుభాష్‌చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.



ఎంఓకు కుదుర్చుకుంటున్న జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు

## వెయ్యి మందితో మెగా రక్తదాన శిబిరం

### - వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలకు తరలి రండి
### - నియోజకవర్గ సమన్వయ కర్త సాకే శైలజానాథ్

శింగనమల, డిసెంబర్ 18 ప్రభాతవార్త
వైఎస్ఆర్‌సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 53వ పుట్టిన రోజు సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని నార్పల మండల కేంద్రంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆత్మారామ దేవాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 21వ తేది ఉదయం 10 గంటలకు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు నార్పల మండల కేంద్రంలో ఆరు మండలాల నుంచి వెయ్యి మంది జగన్‌మోహన్‌రెడ్డి సైనికులతో రక్తదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రక్తదానం చేసిన ప్రతి ఒక్క జగనన్న సైనికునికి 3 లక్షల ప్రమాద భీమాతోపాటు ఒక ప్రశంసా పత్రం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పూల ప్రసాద్, రైతు విభాగం అధ్యక్షులు తరిమెల గోకుల్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు బొమ్మన శ్రీరామిరెడ్డి, ఆలీబాషా, శివారెడ్డి, మల్లికార్జున రెడ్డి, ఎన్‌వి.నారాయణ, వెంకటప్ప, జల్లి శ్రీనివా సులు, దుద్దుకుంట భాస్కర్‌రెడ్డి, బాలరెడ్డి, నవీన్‌కుమార్, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయ కర్త సాకే శైలజానాథ్

## డా.రామసుబ్బయ్య వైద్య రంగంలో చేసిన సేవలు మరువలేనివి

### - వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం సిటీ, డిసెంబర్ 18 ప్రభాతవార్త
.ప్రముఖ వైద్యులు డా.రామసుబ్బయ్య వైద్య రంగంలో చేసిన సేవలు మరువలేనివని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి కొనియాడారు. ప్రముఖ వైద్యులు రామసుబ్బయ్య గురువారం మ ృతి చెందారు. ఆయన మృతి పట్ల వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఒక ప్రకటన విడుదల చేస్తూ.. అనంతపురంలో మెడికల్ కళాశాల రావడంలో రామసుబ్బయ్య శ్రమ ఎంతో ఉందని పేర్కొన్నారు. వైద్యరంగంలో సేవా పరమావధిగా చివరి క్షణం వరకు కొనసాగారని పేర్కొన్నారు. వైద్య రంగంలో అపారమైన సేవలు అందించడంతోపాటు రెడ్‌క్రాస్ సంస్థతోపాటు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఆయన చేసిన సేవలు మరువలేనిదన్నారు. ఆయన మరణం పట్ల వారికుటుంబీకులకు తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. అదే విధంగా వైసిపి సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి డాక్టర్ రామసుబ్బ య్య నివాసానికి వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



డా.రామసుబ్బయ్య మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న వైసిపి నాయకుడు అనంత చంద్రారెడ్డి

## రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపికైన పీవీకెకె ఐటీ విద్యార్థి

అనంతపురం, డిసెంబర్ 18 ప్రభాతవార్త బ్యూరో
అనంతపురం జిల్లాకు చెందిన పీవీకెకె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థి దాసరి కార్తిక్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికలకు ఎంపికై కళాశాలకు గర్వకారణంగా నిలిచాడని ప్రిన్సిపాల్ డా.బండి రమేష్ బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం కళాశాల ప్రతినిధులతో కలిసి విద్యార్థిని అభినందించి మాట్లాడుతూ.. పీవీకెకె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీ.టెక్ మొదటి సంవత్సరం చదువుతున్న దాసరి కార్తిక్ 16.12. 2025 తేదీన అనంతపురం జిల్లా ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఖోఖో ఎంపికల్లో ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు.
దీంతో రేపు అనగా 19.12.2025 నుండి 21.12. 2025 వరకు ప్రకాశం జిల్లాలోని పంగలూరు గ్రామంలో నిర్వహిం చనున్న రాష్ట్ర స్థాయి ఖోఖో ఎంపికలకు అనంతపురం జిల్లా జట్టు తరఫున పాల్గొన నున్నాడు. ఈ రాష్ట్ర స్థాయి పోటీలు మూడు రోజుల పాటు కొనసాగ నున్నా యి అని తెలిపారు. విద్యార్థిని కళాశాల చైర్మన్ డా.కిషోర్ పల్లె, కళాశాల యా జమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా.మనో హర్ రెడ్డి, వ్యాయా మాధికారి ధనుంజయతో పాటు అధ్యాపకులు అభినందించి, రాష్ట్ర స్థాయిలో కూడా మంచి ప్రతిభ కనబరిచి కళాశాలకూ, జిల్లాకూ మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యా రంగంతో పాటు క్రీడలలోనూ విద్యార్థులను ప్రోత్స హిస్తున్న పీవీకెకె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యాజమాన్యానికి ఇది మరో విశేష గర్వకారణమని వారు పేర్కొన్నారు.



రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపికైన పీవీకెకె ఐటీ విద్యార్థి

## డాక్టర్ రామసుబ్బయ్య మరణం అందరికి తీరని లోటు - ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్

అనంతపురం, డిసెంబర్ 18 ప్రభాతవార్తబ్యూరో
వైద్యరంగంలో విశేషమైన సేవలందించిన డాక్టర్ రామసుబ్బయ్య మరణం వ్యక్తిగతంగా తమ కుటుంబానికి తీరని లోటని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. డాక్టర్ రామసుబ్బయ్య మరణంపై వారు విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని అలాగే వారి కుటుంబసభ్యులు దీని నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదే సమయంలో డాక్టర్ రామసుబ్బయ్యతో వారికున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పరిటాల రవీంద్ర మరణం తర్వాత ఆయన వర్ధంతికి అనేక సార్లు వెంకటాపురంలో రెడ్ క్రాస్ సొసైటీ తరుఫున రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారన్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడంలో తమకు వచ్చిన గుర్తింపుకు ప్రధానమైన కారణం డాక్టర్ రామసుబ్బయ్య అన్నారు. ఆయన జిల్లా వైద్య రంగానికి అందించిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయంగా ఉంటాయని సునీత, శ్రీరామ్ అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ చర్మ వ్యాధుల నిపుణులు డాక్టర్ మాధవిలత, డాక్టర్ వెంకట్ తదితర కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరిటాల సునీత ధైర్యం చెప్పారు.